


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

శనివారం | 15 ఫిబ్రవరి 2025 | హైదరాబాద్

సంపుటి 18 | సంచిక 115

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




- APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
- నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
- కరెంట్ అఫైర్స్
- నమూనా ప్రశ్నాపత్రాలు
- విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, మాఘమాసం బ.తదియ రా.10.28, ఉత్తర రా.12.38, వర్జ్యం ఉ.8.06 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.05 వరకు



6 లో

# సుంకాలు తగ్గించలేం

## ప్రధాని మోడీకి తేల్చి చెప్పిన ట్రంప్

- న్యూఢిల్లీ పన్నులు తగ్గిస్తే.. తాము అదే పని చేస్తామని సూచన
- తగ్గేదేలే అని సున్నితంగా ప్రధాని వినతి తిరస్కరణ
- అధునాతన ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు సిద్ధం
- భారత్‌కు మిలిటరీ ఉత్పత్తుల విక్రయాలను పెంచుతామన్న ట్రంప్
- మనం కలిస్తే మెగాగా మారుతామన్న భారత ప్రధాని మోడీ
- అక్రమ వలసదారులకు దేశంలో ఉండే హక్కురాదని వ్యాఖ్యలు

అక్క అక్కే.. లెక్క లెక్కే అన్నటుంది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి. భారత్ ఎంత మిత్ర దేశమైనా.. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా నేడు శ్వేతసౌధంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రెసీపకల్ టారిఫ్‌ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు



5 లో

- టారిఫ్‌లను సమర్థించుకున్న ట్రంప్
- 199 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 102 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- 4 శాతానికిపైగా నష్టపోయిన అదానీ పోర్ట్స్

## చంద్రబాబూ.. మీ ప్రభుత్వం కూలిపోతుంది



6 లో

- బీజేపీని నమ్మితే ఏం జరుగుతుందో ముందు ముందు తెలుస్తుంది
- హెచ్చరించిన శివసేన (యుబిటి ) పార్టీ నేత ఆదిత్య ఠాక్రే

# నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాలి

- స్థల సేకరణ.. అనుమతులపై సీనియర్ అధికారులు దృష్టి సారించాలి
- కలెక్టర్లు క్షేత్ర స్థాయి పరిశీలనలు చేపట్టాలి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఐసీసీసీలో విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. కొడంగల్, మధిర, హుజూర్ నగర్ ల్లోని స్కూళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, మార్చి 20వ తేదీన పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.



7 లో


సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్


## సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు




2 లో

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్తుల రిజిస్ట్రేషన్ల విషయంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు భారీ మార్పులు చేపడుతోంది. ముఖ్యంగా ఎప్పటికప్పుడు మారుతున్న వినియోగదారుల అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇదే క్రమంలో ప్రభుత్వం మరో సంచలన ఉత్తర్వులు ఇచ్చింది.

## వంశీని వెంటాడిన ఖర్మ సిద్ధాంతం



7 లో

- ఆకాశం నుంచి అధ:పాతాళానికి ప్రజలకు సేవలందించినా, నోటు దురుసుతో దూరమైన నేత
- ఎదిగిన పార్టీకే ఎదురుతిరిగిన నేత
- సీఎం కుటుంబంపై చేసిన వ్యక్తిగత విమర్శలే శాపంగా మారాయి
- సొంత సామాజికవర్గంలోనూ వ్యతిరేకత
- సక్సెస్‌ఫుల్ రాజకీయ జీవితానికి సమాధి
- పలు కేసుల్లో నిందితుడు

## యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

- యాసిడ్ దాడికి గురైన మహిళకు ప్రభుత్వం తరఫున అన్ని సదుపాయాలు కల్పిస్తాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి

గుర్రంకొండ మండలం, ప్యారంపల్లి గ్రామానికి చెందిన గౌతమి అనే మహిళపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.



2 లో

## కాంగ్రెస్ ఓటమి ఖాయం



3 లో

### వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో మార్పు రాలేదు... మారింది సీఎం, పార్టీ జెండా మాత్రమే.. పరిపాలన మాత్రం అలానే ఉంది అని అన్నారు.

## కేసీఆర్, కేటీఆర్ కుల గణన సర్వేలో భాగస్వామ్యం కావాలి

- గాంధీ భవన్‌లో కుల గణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గాంధీ భవన్ లో కుల గణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. అన్ని ఫలాలు జనాభా దామాషా ప్రకారం పంచాలని రాహుల్ గాంధీ ఆలోచన అని అన్నారు.



7 లో


## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలి




7 లో

- ప్రజల రవాణా పరమైన సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి
- నాన్ ఆఫీసియల్ సభ్యుల సమావేశంలో మంత్రి పొన్నం

## అంతా ఇంతే!




ఇంతవరకు బీసీ ప్రధాని అని అనవసరంగా చెప్పుకున్నామని అంటున్నారు



# మీ బీసీ లెక్కేంటీ?

- సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో అత్యధిక శాతం అగ్రకులస్తులే
- రేవంత్‌తో కలిపి రెడ్డి 4, బ్రాహ్మణ 1, వెలమ 1, కమ్మ 1, ఎస్సీ 3 శాఖలు
- బీసీలకు కేవలం రెండు మంత్రి పదవులు మాత్రమే
- ప్రాధాన్యత శాఖలు అగ్ర కులానికి చెందినవారే

ఈ ఆరోపణలతో అటు బిజెపి ఇటు కాంగ్రెస్ మధ్యన రచ్చ తెరపైకి వచ్చింది. మోడీపై విమర్శలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి తన ప్రభుత్వంలో బీసీలకు మంత్రి పదవులు కట్టబెట్టిన విషయాన్ని పరిగణలోకి తీసుకుంటే నేతి బీరకాయలో నేతి ఎంత ఉంటుందో అన్న విధంగా బహిర్గతం అవుతుంది.

# మోడీ బీసీ కాదు

## ప్రధానిపై సీఎం రేవంత్ హాట్ కామెంట్స్

- మోడీ బీసీ కాదంటూ ఆరోపణలు
- పుట్టుకతో బీసీ కాదు అధికార కన్వర్ట్ బిసి
- 2001 తర్వాత ఓసి నుండి బీసీకి మార్పు
- మోడీ 2021లో జనాభా లెక్కలు ఎందుకు తీయలేదు
- చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్త జనగణలో కుల గణన చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రంలో బీసీ గణన జరుగుతున్న నేపథ్యంలో మరోసారి భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీల మధ్య బీసీ వాదం తెరపైన చర్చ జరుగుతుంది. శుక్రవారం గాంధీభవన్ల జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఏకంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ బీసీ కాదంటూ సంచలన ఆరోపణలు చేశారు.






# వంశీ కస్టడికి పోలీసుల పిటిషన్ : పోలీస్ కమిషనర్ కీలక వ్యాఖ్యలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ వ్యవహారం రాజకీయ వర్గాలలోను, ప్రజలలోను చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా వల్లభనేని వంశీ అరెస్టు పైన విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీస్ కస్టడీకి వల్లభనేని వంశీని తీసుకుంటాం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు ఆ తర్వాత జరిగిన పరిణామాలపై మీడియాతో మాట్లాడిన ఆయన వల్లభనేని వంశీని పోలీస్ కస్టడీకి తీసుకుంటామన్నారు. దీనికోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. నేరం చేసిన తర్వాత ఎవరు తప్పించుకోలేని విధంగా టెక్నాలజీ ఉందని, వల్లభనేని వంశీ మాట్లాడిన ఫోన్ కాల్స్, సీసీ కెమెరా ఫుటేజ్ ఈ కేసులలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. టెక్నికల్ గా కేసు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నాం పక్కా ఆధారాలతోనే వల్లభనేని వంశీని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని సిపి రాజశేఖర్ బాబు వెల్లడించారు. వల్లభనేని వంశీ కేసుపైన టెక్నికల్ గా ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని పేర్కొన్న ఆయన నేడో రేపు కస్టడీ పిటిషన్ ఫైల్ చేస్తామని తెలిపారు. విచారణలో ఏ కారు ఎక్కడ నుండి వచ్చింది ఎటు వెళ్ళింది అనేది తేలుతుందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీ నుండి ఎవరు తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు. వల్లభనేని వంశీకి కోర్టు రిమాండ్ గన్నవరం టిడిపి కార్యాలయం పైన దాడి కేసులో ఏ 71 ఎఫ్ఐఆర్ లో ఉన్న వల్లభనేని వంశీ పైన తాజాగా కిడ్నాప్, బెదిరింపుల కింద ఏవన్ గా పోలీసులు కేసు నమోదు చేసి వంశీ ని హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. కోర్టు వల్లభనేని వంశీకి 14 రోజుల రిమాండ్ విధించింది. వంశీ తో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న లక్ష్మీపతి, కృష్ణ ప్రసాద్ కి కూడా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. సత్యవర్ధన్ ను బెదిరించటంలో వల్లభనేని వంశీది కీలక పాత్ర సత్య వర్ధన్ ను బెదిరించడంలో వల్లభనేని వంశీ కీలకపాత్ర పోషించారని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అంతే కాదు వంశీకి చట్టాలపై గౌరవం లేదని తెలిపారు.

# జన భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర మిషన్



● పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, పని ప్రాంతాల్లో పరిశుభ్రతను ఒక బాధ్యతగా తీసుకోవాలి ● స్వచ్ఛాంధ్ర అనేది ఒక వ్యక్తికో, ఒక సంస్థకో చెందిన కార్యక్రమం కాదు ● పిసిబి గాలి నాణ్యతను పరిశీలించాలి నెట్ జీరో కార్యక్రమాలు అమలు చేయాలి ● 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు, మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా చివరి స్థానంలో అల్లూరి జిల్లా ● స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 14:- స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాముల కావాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని... వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పరిశుభ్రత పెంచేందుకు... అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు అమలు చేస్తున్న కార్యాచరణపై సీఎం సమీక్ష చేశారు. ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతి నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్ గా తీసుకోగా... ఈ నెలలో సోర్స్ రీ సోర్స్ అనే అంశాన్ని థీమ్ గా తీసుకున్నారు. మన మూలాలు - మన బలాలు తెలుసుకునేలా, రాష్ట్రంలోని వనరులను ఎలా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి అనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటకరంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సిఎం సూచించారు. సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం, పారిశుధ్యానికి ప్రాధాన్యత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, ఇంకా కేంద్రం నిర్దేశించే లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన మనుషులు, స్వచ్ఛమైన మనసులు, స్వచ్ఛమైన పరిసరాలు, స్వచ్ఛమైన ఇళ్లు, కాలనీలు, ఊళ్లు అని అంతా గుర్తించాలని సిఎం అన్నారు. ఇళ్లతో పాటు... బహిరంగ ప్రదేశాలను, స్కూళ్లు, కాలేజ్ లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, పరిశ్రమలు కూడా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం ప్రతి వ్యక్తి, ప్రతి ఉద్యోగి, ప్రతి సంస్థ, ప్రతి వ్యవస్థ పనిచేయాలన్నారు. ఇది ఏ ఒక్క శాఖకో... ఒక్క అధికారికో సంబంధించిన కార్యక్రమంగా చూడవద్దని... పరిశుభ్రత, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో పాఠశాల విద్యార్థి నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోలని సిఎం పిలువునిచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఆ కార్యాలయంలో ఉండే ఉద్యోగులు అంతా కలిసి పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కృషి చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యత లేకుండా వ్యవహరించాలని అన్నారు. రోడ్లపై చెత్త వేసి, చెట్లు నరికి వేసి, అంతా క్లీన్ గా ఉండాలి, పచ్చదనం ఉండాలి అని స్లోగన్స్ ఇస్తే కుదరదని అన్నారు. పౌరులు కూడా బాధ్యత వహిస్తే స్వచ్ఛాంధ్ర కల సాకారం చేసుకోవచ్చని సీఎం సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతా కృషి చేయాలి అన్నారు. గాలిలో నాణ్యతను పరిశీలించి సమస్య ఉన్న ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పెరుగుతున్న సమయంలోనే గుర్తించి ఇప్పటి నుంచే అక్కడ పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. ఈ విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వంటి శాఖల అధికారులు ఫోకస్ పెట్టాలని సూచించారు.




**జిల్లాలకు ర్యాంకులు :** స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రోగ్రస్ ను సీఎంకు వివరించారు. మొత్తం 14 ఇండికేటర్స్ లో పెట్టుకున్న లక్ష్యాలను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కమ్యూనిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిపై సిఎంకు వివరించారు. ఈ 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాకు ర్యాంకులు ఇచ్చారు. పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్ కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్ కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్ కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు 20 పాయింట్లు ఇచ్చారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్స్ కు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ కు 10 పాయింట్లు, 100 శాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ కు 10 పాయింట్లు, ఓడిఎఫ్ ప్లస్ మోడల్ కు 20 పాయింట్లు చొప్పున ఇచ్చారు. ఇలా మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రస్ పై ర్యాంకులు ఇచ్చారు. మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా : మొత్తం 200 పాయింట్లకు గాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 127 పాయింట్లతో విశాఖ రెండో స్థానంలో, 125తో ఈస్ట్ గోదావరి 3వ స్థానం, 122తో అనంతపురం జిల్లా 4వ స్థానం, 120 పాయింట్లతో అన్నమయ్య 5వ స్థానం, శ్రీకాకుళం 6వ స్థానంలో ఉన్నాయి. 118 పాయింట్లతో కడప 7వ స్థానం, 117 పాయింట్లతో గుంటూరు 8వ స్థానం, 115 పాయింట్లతో బాపట్ల 9వ స్థానం, 115 పాయింట్లతో నెల్లూరు 10వ స్థానం, 115 పాయింట్లతో వెస్ట్ గోదావరి 11వ స్థానం, 113 పాయింట్లతో అనకాపల్లి 12వ స్థానం, 111 పాయింట్లతో తిరుపతి 13వ స్థానంలో, 109 పాయింట్లతో కాకినాడ 14వ స్థానంలో ఉన్నాయి. 108 పాయింట్లతో ఏలూరు 15వ స్థానం, 108 పాయింట్లతో కృష్ణ 16వ స్థానం, 105 పాయింట్లతో కోనసీమ 17వ స్థానం, 105 పాయింట్లతో మన్యం పాడేరు 18వ స్థానం, 105 పాయింట్లతో సత్యసాయి 19వ స్థానం, 103 పాయింట్లతో పల్నాడు 20వ స్థానం, 99 పాయింట్లతో కర్నూలు 21వ స్థానం, 99 పాయింట్లతో ప్రకాశం 22వ స్థానం, 94 పాయింట్లతో నంద్యాల 23వ స్థానం, 93 పాయింట్లతో విజయనగరం 24వ స్థానం, 88 పాయింట్లతో చిత్తూరు 25వ స్థానం, 81 పాయింట్లతో అల్లూరి సీతారామరాజు 26వ స్థానంలో ఉన్నాయి.

# యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

● యాసిడ్ దాడికి గురైన మహిళకు ప్రభుత్వం తరపున అన్ని సదుపాయాలు కల్పిస్తాం ● యాసిడ్ దాడులను సహించేది లేదు ● కేవలం 15 నిమిషాల్లోనే నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది ● యాసిడ్ దాడి సంఘటనపై వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్ ● రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మడిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గుర్రంకొండ మండలం, ప్యారంపల్లి గ్రామానికి చెందిన గౌతమి అనే మహిళపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి మండిపల్లి రాంపప్రసాద్ రెడ్డి యాసిడ్ దాడికి గురైన మహిళలను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాష, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి జయ చంద్రారెడ్డి, శ్రీరామ్ చిన్నబాబు లతో కలిసి మంత్రివర్యులు మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాధితురాలని, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంపప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... గుర్రంకొండ మండలం, ప్యారంపల్లెకు చెందిన గౌతమి అనే మహిళ డిగ్రీ పూర్తి చేసుకొని బ్యూటిషన్ పని చేసుకుంటూ ఉండేదన్నారు. ఈమెపై గణేష్ అనే వ్యక్తి యాసిడ్ దాడికి పాల్పడం జరిగిందని యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తిని కేవలం 15 నిమిషాల లోనే అదుపులోకి తీసుకుని నిందితుడిని రిమాండ్ కు పంపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.మహిళలపై యాసిడ్ దాడులకు పాల్పడే వ్యక్తులను సహించేది లేదని అలాంటి వారిని కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ఉండేందుకు మహిళలు ముందస్తు జాగ్రత్తగా పోలీసులను ఆశ్రయించాలన్నారు. యాసిడ్ దాడికి గురైన మహిళను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెంగళూరుకు తరలించి అక్కడ మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యాసిడ్ బాధితురాలు ఆరోగ్యం గురించి మంత్రి మండిపల్లి రాంపప్రసాద్ రెడ్డి గారికి ఫోన్ చేసి బాధితురాలి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యాసిడ్ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు పూర్తిగా కోరుకునేంతవరకు ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు తీసుకోవడం జరుగుతుందని నారా లోకేష్ మంత్రివర్యులకు తెలిపారు.



# వంశీ మీద పెట్టిన అక్రమ కేసు నిలబడదు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తాడేపల్లి: వల్లభనేని వంశీని అరెస్ట్ చేయొద్దని స్పష్టమైన కోర్టు ఆదేశాలున్నా, పోలీసులు వాటిని ధిక్కరించి మరీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్రం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం చేతిలో ఉంటే ఏం చేసినా చెల్లుబాటవుతుందనే పిచ్చి భ్రమల్లో నుంచి కూటమి నాయకులు బయటకు రావాలని హితవు పలికారు. నియంత పాలన ఎంతోకాలం సాగదని చెప్పిన జూపూడి.., వంశీ మీద పెట్టిన తప్పుడు కేసులు నిలబడవని చెబుతూ 24 గంటల్లోనే ఆయన బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జూపూడి ప్రభాకర్ ప్రెస్ మీట్ పాయింట్స్**

అన్యాయం జరిగిందని న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే, బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్న దౌర్భాగ్య పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. అధికారం చేతిలో ఉంటే ఏమైనా చేస్తామనే విధంగా రాష్ట్రంలో కూటమి నాయకులు కోర్టులను సైతం లెక్కచేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉన్నంత మాత్రాన రాజ్యాంగంతో, చట్టాలతో ఆటలాడుకుంటామంటే కుదరదు. అవే చట్టాలు మీ మెడలకు బిగుసుకునే రోజులు తొందర్లోనే ఉన్నాయని మర్చిపోకండి. అధికారం లేరు కదా వైయస్సార్సీపీ శ్రేణులను ఏమైనా చేయొచ్చనే భ్రమల్లో నుంచి బయటకు రండి. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడే ప్రసక్తే లేదు. గన్నవరం టీడీపీ ఆఫీస్ పై దాడి కేసులో ఫిర్యాదు దారుడిగా ఉన్న సత్యవర్ధన్.. తనకు ఈ కేసుకు ఎటువంటి సంబంధం లేదని జడ్జి ముందు తేల్చిచెప్పాడు. కేసు విరమించుకుంటున్నట్లు జడ్జికి తెలిపాడు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ ముందు తనను పోలీసులు ఎలా ఒత్తిడి పెట్టారో స్పష్టం చేశాడు. తనకు పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని జడ్జిని వేడుకు న్నాడు. కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, స్వయంగా అఫిడవిట్ సమర్పి ంచాడు. తనను సాక్షిగా పిలిచి సంతకం చేయించుకున్నారని సత్యవర్ధన్ తెలిపాడు. తనను ఎవరూ కులం పేరుతో దూషించలేదని పేర్కొన్నాడు. గన్నవరం టీడీపీ ఆఫీస్లో కంప్యూటర్ ఆపరేటర్గా పని చేసిన తనపై పోలీసులే ఒత్తిడి తెచ్చి కేసును నమోదు చేయించారన్నాడు. టీడీపీ నేతలు, పోలీసులు కుట్ర చేసి కేసు నమోదు చేశారన్నాడు. ఆ రోజు తాను అక్కడేలేనని పేర్కొన్నాడు సత్యవర్ధన్. సత్యవర్ధన్ స్టేట్మెంట్ను స్వయంగా రికార్డు చేశారు జడ్జి. సత్యవర్ధన్ నిజం ఒప్పుకోవడంతో ఉలిక్కిపడిన కూటమి నాయ కులు అతని ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను బెదిరించారు. వాస్తవానికి తెలుగుదేశం పార్టీ ఆఫీసు మీద దాడికి నాటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఎలాంటి సంబంధం కూడా లేదు.

# సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

● రూ.5 వేలు అదనంగా చెల్లించాలి ● పని దినాల్లోనూ స్లాట్ విధానం ● ఎటువంటి రుసుము లేకుండానే స్లాట్ బుకింగ్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్తుల రిజిస్ట్రేషన్ల విషయంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు భారీ మార్పులు చేపడుతోంది. ముఖ్యంగా ఎప్పటికప్పుడు మారుతున్న వినియోగదారుల అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇదే క్రమంలో ప్రభుత్వం మరో సంచలన ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల్లో బ్రిటీష్ కాలం నాటి రెడ్ టేబుల్ పోడియం వ్యవస్థను తొలగించింది. అధికార దర్పానికి చిహ్నంగా ఉన్న ఆ పోడియాలను తొలగించింది. అలాగే రిజిస్ట్రేషన్ల విలువల్లో మార్పులు చేస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే వినియోగదారులకు పడిగాపులు లేకుండా చేసేందుకు మరో ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం ఇకపై ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే సబ్ -రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చి పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. దీనికి బదులు ఇంట్లోనే కంప్యూటర్ ముందు కూర్చుని రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకుంటే సరిపోతుంది. ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఇచ్చిన డేట్ కు ఆఫీసుకు వెళ్తే సరిపోతుంది. ఎలాంటి పడిగాపులు లేకుండా సింపుల్ గా మీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు దీన్ని ముందుగా జిల్లా కేంద్రాల్లో ఉన్న రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అందుబాటులోకి తెస్తారు. ఆ తర్వాత క్రమంగా అన్ని ఆఫీసులకు వర్తింపజేస్తారు. ఇలా స్లాట్ బుక్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్ సైట్ లోకి వెళ్లి వివరాలు నింపితే సరిపోతుంది. దీనికి ఎలాంటి ఛార్జీలు కూడా లేవు. అయితే స్లాట్ క్యాన్సిల్ చేసుకుంటే మాత్రం రూ.100, , రీషెడ్యూలింగ్ కు అయితే రూ.200 వసూలు చేయాలని నిర్ణయించారు. పని దినాల్లో సాయంత్రం 5 గంటల వరకూ ఇలా స్లాట్స్ బుక్ చేసుకోవచ్చు. సెలవు దినాల్లో స్లాట్ కావాలంటే మాత్రం 5 వేలు చెల్లించాల్సి ఉంటుంది.




# భారీగా తగ్గిన చికెన్ ధరలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ భయాందోళనను కలిగిస్తోంది. కొన్ని వారాలుగా చాలా ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్లకు వైరస్ సోకి పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండడంతో చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు. కోళ్ళ ఫారాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ ధరలు భారీగా తగ్గినా.. భయంతో చాలా వరకు చికెన్ తినేందుకు ఇష్టపడడం లేదు. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో హైదరాబాద్ చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపో యాయి. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మటన, చేపలకు భారీగా గిరాకీ పెరిగిపోయింది.విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ ఏపీలో బర్డ్ ఫ్లూ సోకి 5 లక్షలకు పైగా కోళ్లు మృత్యువాత పడినట్లు ఆ రాష్ట్ర సర్కారు పేర్కొంది. దీంతో ఏపీలోని పలు జిల్లాల్లో చికెన్ తినడాన్ని నిషేధించారు. ఈ క్రమంలో ఏపీలో చికెన్ విక్రయాలు సగానికి పైగా తగ్గిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విజృంభిస్తోంది. ఫారాల్లో పెంచుతున్న కోళ్లు ఎక్కువగా బర్డ్ ఫ్లూ సోకి మరణిస్తున్నాయి. బర్డ్ ఫ్లూ సాధారణంగా జంతువులు, పక్షుల నుంచి మనుషులకు సోకుతుంది. కోళ్ల నుంచి అధికంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. బర్డ్ ఫ్లూ సోకిన జంతువులు, పక్షులకు దగ్గరగా ఎక్కువ సేపు ఉన్నా ఇది వస్తుంది. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లను తిన్నా మనుషులకు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. చికెన్ ను బాగా శుభ్రం చేసి ఉడికించడం ద్వారా అందులోని వైరస్ చనిపోతుంది. ఉడికి ఉడకని చికెన్ తిన్నా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. అందుకే బర్డ్ ఫ్లూ కొన్ని రోజుల పాటు చికెన్ తినకపోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# ఉత్తమ సీఎంల జాబితాలో నాలుగో స్థానంలో చంద్రబాబు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో నాలుగవ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కి హౌసింగ్ అండ్ ఐ అండ్ పిఆర్ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ప్రతిష్టాత్మక ఇండియా టుడే పత్రిక సర్వేలో చంద్రబాబు నాయుడు గారు నాలుగో స్థానంలో నిలవడం మాకు గర్వకారణమన్నారు.. కేవలం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ఐదో స్థానం నుంచి ఆయన నాలుగో స్థానానికి చేరుకోవడం సంక్షేమం కోసం ఆయన పడుతున్న శ్రమ, ప్రగతి సాధించడానికి పట్టుదలతో పనిచేస్తున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. కేవలం కొన్ని నెలల కాలంలోనే ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడులను సాధించడం ప్రజలకు, పెట్టుబడిదారులకు ఆయన మీద ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఐదేళ్లపాటు అన్ని రంగాల్లో విధ్వంసాన్ని చవిచూసిన రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పట్టా లెక్కించేందుకు ముఖ్యమంత్రి గారు నిరంతరం శ్రమించడం అందరికీ ప్రత్యేకించి యువతకు కచ్చితంగా మార్గదర్శకమని తెలిపారు.. ప్రజలకు వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటానికి, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ముందుండి నడిపిస్తున్నారని చెప్పారు.. వారి మార్గదర్శకత్వంలో తాము కూడా అన్ని విధాలుగా కష్టపడుతున్నామని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి 20 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆశయాన్ని ప్రభుత్వం త్వరలోనే చేరుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# భవిష్యత్తు అభివృద్ధికి డేటా ఆధారిత పరిపాలన కీలకం



● ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా ● వ్యాపార వ్యూహాలలో ప్రాధాన్యత సంతరించుకున్న డేటా విశ్లేషణ ● డేటా వినియోగం, నిర్వహణలో నైతికత అత్యంత అవశ్యకం

ఏపీ స్టేట్ బ్యూరో,సూర్య ప్రధాన ప్రతినిధి : ఆధునిక పరిపాలన, వ్యాపార వ్యూహాల్లో డేటా కీలకమైన స్థానం కలిగి ఉంది. విశ్లేషణలు, కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకునే సామర్థ్యం గల సంస్థలే భవిష్యత్తులో విజయాన్ని సాధిస్తాయి అని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, సర్వే సెటిల్ మెంట్, భూపరిపాలన) ఆర్.పీ. సిసోడియా అన్నారు. బిజినెస్ అనలిటిక్స్, ఇంటెలిజెన్స్లో పురోగమనలు అనే అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు సిసోడియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు నేతృత్వంలో రాష్ట్రంలో అధునిక సాంకేతిక పరిపాలనకు సాగుతోందని, ప్రతి ఒక్కరూ దానిని అందిపుచ్చుకోవాలని కోరారు. సిసోడియా ప్రసంగిస్తూ డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను వివరించారు. ఆదాయ నిర్వహణ నుంచి ప్రజా సేవల దాకా అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు, పెద్ద డేటా విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని, వాటి ద్వారా ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు మంచి వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవచ్చని అన్నారు. డేటా విశ్లేషణను సమర్థంగా వినియోగించుకునే సంస్థలు ఆర్థిక అభివృద్ధిలో ముందంజలో ఉంటాయన్నారు. డేటా ఆధారిత భవిష్యత్తుకు విద్యార్థులు, నిపుణులను సిద్ధం చేయడం చాలా అవసరమని, డేటా వినియోగంలో నైతికత అత్యంత కీలకమైన అంశమన్నారు. ఎవరు డేటాను సమర్థంగా విశ్లేషించి, అర్థం చేసుకుని, నిపుణంగా నిర్ణయాలు తీసుకుంటారో వారిదే భవిష్యత్తు అన్న సిసోడియా వారే విజయం సాధిస్తారని స్పష్టం చేసారు. డేటా ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య ఒప్పందాలు, సంశోధనలో భాగస్వామ్యం పెరగడం అభినందనీయమని అన్నారు. డేటా ఆధారిత యుగంలో నిరంతర అభ్యాసం, మార్పులకు అనుగుణంగా తమని తాము మలచుకోవడం చాలా అవసరమని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి అచార్య కె. గంగాధర రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బిజినెస్ అనలిటిక్స్ పరిశోధన, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ముందుండాలని పిలువునిచ్చారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అకడెమియా-ఇండస్ట్రీ కలయిక అవసరమన్నారు. సదస్సు డైరెక్టర్, వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగాధిపతి అచార్య రామినేని శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వ్యూహాలలో డేటా విశ్లేషణ ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి అకడమిక్ సదస్సులు విద్యార్థులు, పరిశోధకులకు విలువైన పరిజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. సదస్సులో ప్రముఖ విశ్వవిద్యాలయాల నిపుణులు ఈ అంశంపై దృక్పథాలను పంచుకున్నారు. ఐఐఎం విశాఖపట్నంకు చెందిన అచార్య విజయ భాస్కర్ కీలకోపన్యాసం చేస్తూ బిజినెస్ ఇంటెలిజెన్స్లో ఎఐ, మెషిన్ లెర్నింగ్ పెరుగుతున్న ప్రభావాన్ని వివరిస్తూ, నైతిక డేటా నిర్వహణ కీలకమని అన్నారు. ఐఐఎం రాయ్పూర్కు చెందిన వర్ష మామిడి, మేధో సంపత్తి హక్కులు, డేటా విశ్లేషణ అనుసంధానంపై మాట్లాడారు. ఐపీఈ హైదరాబాదు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, భవిష్యత్తు అంచనాల ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ పరిశ్రమల్లో దీని వాస్తవ ఉపయోగాలను తెలియజేశారు. వ్యాపార విశ్లేషణలో ఆధునిక సాంకేతికతల పాత్ర, పెద్ద డేటా నిర్వహణలో సవాళ్లు, ఎఐ ఆధారిత విశ్లేషణలు ఎలా పరిశ్రమలను మార్చుతున్నాయనే అంశాలపై సదస్సు చర్చించింది. కార్యక్రమంలో డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనంద్ రెడ్డి సేవా కార్యక్రమాలను అభినందించిన సీఎం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. సచివాలయంలో ని ముఖ్యమంత్రి ఛాంబర్ లో ఆనంద్ రెడ్డి చంద్రబాబు ని కలసి తన సేవా కార్యక్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. ఆనంద్ రెడ్డి చంద్రబాబుకు నారా లోకేష్ అభిమాన సంఘం దేశవ్యాప్తంగా చేస్తున్న పలు సేవా కార్యక్రమాల గురించి తెలియజేశారు. చంద్రబాబు మాట్లాడుతూ ఇంతటి మంచి సేవా కార్యక్రమాలు సమాజానికి చాలా అవసరం మరియు ఉపయోగకరం అని అన్నారు, అలాగే ఈ నారా లోకేష్ అభిమాన సంఘాన్ని స్థాపించి ఆనంద్ రెడ్డి ఇంతటి గొప్ప సేవా కార్యక్రమాలను నిర్వహించడం చాలా చాలా గొప్ప విషయం అని తెలియజేశారు, అలాగే చంద్రబాబు మాట్లాడుతూ ఈ నారా లోకేష్ అభిమాన సంఘం యొక్క సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ ఉండాలని అలాగే తమ వంతు సహకారం కూడా అందిస్తామని ఇలాంటి మంచి కార్యక్రమాలను మేము కూడా ప్రోత్సహిస్తామని తెలియజేశారు. ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు మంత్రివర్యులు నారా లోకేష్ చేస్తున్న సహాయ కార్యక్రమాలు మరియు విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలియజేశారు మరియు లోకేష్ ఆంధ్ర రాష్ట్రాన్ని పారిశ్రామికంగా చాలా అభివృద్ధి చేస్తూ దాదాపు 20 లక్షల ఉద్యోగాలని కల్పించడానికి ప్రయత్నిస్తున్నారని మరియు ప్రతి ఉమ్మడి జిల్లాకి ఒక ఇండస్ట్రియల్ కారిడార్ని నిర్మిస్తున్నారని తెలియజేశారు. అలాగే ఆనంద రెడ్డి చంద్రబాబును కళ్యాణదుర్గం నియోజకవర్గ బి టి పి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని మరియు గుంతకల్లులో మూతపడిన స్పిన్నింగ్ మిల్లును ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కేరళలోని కొట్టాయంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులపై సీనియర్లు ర్యాగింగ్ చేసారు. హాస్టల్ గదుల్లో వివస్త్రలను చేసి, ప్రైవేట్ భాగాలపై గాయాలు కలిగించడానికి డంబెల్స్ ఉపయోగించి తీవ్రమైన శారీరక వేధింపులకు గురిచేసి క్రూరంగా హింసించారు. ఈ విషయం విన్న ప్రజలందరూ ఒక్కసారి తుళ్ళిపడ్డారు.

కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులతో స్నేహాన్ని బలపరుచుకునే విధానాన్ని మరచి సాటి విద్యార్థులను హింసకు గురిచేసి వాటిని చూసి పాశవిక ఆనందాన్ని పొందుతూ ఒక్కోసారి సాటి విద్యార్థులను చావు దాకా తీసుకెళుతున్నారు అక్కడి సీనియర్లు. ర్యాగింగ్ వందలాది మంది అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. వేలాది మంది తెలివైన విద్యార్థుల కెరీర్ను నాశనం చేసింది. విద్యా సంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను మానసికంగా, శారీరకంగా వేధించడం లేదా అణచివేయడాన్ని ర్యాగింగ్ అంటారు. ' మాట్లాడడం లేదా వ్రాయడం ద్వారా ఇతర విద్యార్థులను ఆటపట్టించేలా ప్రవర్తించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం. క్రమశిక్షణా రాహిత్యంతో కూడిన ఏదైనా క్రమరహిత ప్రవర్తన. ' అని 1999లో విశ్వ జాగృతి కేసు విషయంలో సుప్రీం కోర్టు ర్యాగింగ్ను నిర్వచించింది. ఇది మానవ హక్కుల దుర్వినియోగానికి పరాకాష్ట. ర్యాగింగ్ అనేది శారీరక, మానసిక, లైంగిక వేధింపులతో సహా అనేక రూపాలలో ఉంటుంది. ర్యాగింగ్ కూడా ఒక రకమైన వివక్షే! రంగు, జాతి, మతం, కులం, లింగం, లైంగిక ధోరణి, భాషా గుర్తింపు, పుట్టిన ప్రదేశం, నివాసస్థలం, ఆర్థిక నేపథ్యం, ప్రాంతీయత ఆధారంగా మరొక విద్యార్థిపై చూపే వివక్ష! దీనికి ఎక్కువ శాతంలో సామాన్యులు మాత్రమే అధికంగా బలవుతున్నారు. సామాజికంగా, ఆర్థికంగా హోదాలో ఉన్నవారి జోలికి ర్యాగింగ్ దరిచేరదు. ఎందుకంటే వాళ్లంటే భయం. డెబ్భైవ దశకం చివరిలో ఒక ప్రాంతీయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇద్దరు ఫ్రెషర్లు మరణించిన తరువాత కేంద్ర ప్రభుత్వం దేశంలో ర్యాగింగ్ను నిషేధిస్తూ మొదటిసారి నోటిఫికేషన్ను జారీ చేసింది. మద్రాస్ విశ్వవిద్యాలయం అప్పటి వైస్ ఛాన్సలర్ కుమారుడు నవరసుపై అదే కళాశాలలో సీనియర్ విద్యార్థి జాన్ డేవిడ్ దాడి చేయడమే కాకుండా తన పాదరక్షలను విప్పి నాకమని బలవంతం చేశారు. అతను అలా చేయడానికి నిరాకరించడంతో అతన్ని హింసాత్మకంగా కొట్టి చంపారు. ఈ కేసు ఆధారంగా 1997లో తమిళనాడు రాష్ట్రం దేశంలోనే మొట్టమొదటి ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని ఆమోదించింది. ర్యాగింగ్ను అరికట్టేందుకు విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాలని విశ్వ జాగృతి

## "ర్యాగింగ్ రక్కసిని రెక్కపట్టి నెట్టేయ్యాలి"

మిషన్ దాఖలు చేసిన పిల్పై సుప్రీంకోర్టు 1999లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ని కోరింది. 'ప్రొఫెసర్ కెపియస్ ఉన్ని' ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ర్యాగింగ్పై చట్టాలు తీసుకురావాలని, అడ్మిషన్ రద్దు నుంచి లక్ష రూపాయల వరకు జరిమానాతోపాటు శిక్షలు విధించాలని పేర్కొన్నారు. వసతిగృహాల్లో వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ర్యాగింగ్ను అరికట్టడంలో విఫలమైన సంస్థలను మూసేయ్యాలని కూడా సూచించారు. 2001లో సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ర్యాగింగ్ను నిషేధించింది. ర్యాగింగ్ సమస్యలను పర్యవేక్షించడానికి, పరిష్కరించడానికి విద్యా సంస్థలలో ప్రొక్టోరల్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. తీవ్రమైన సంఘటనలు జరిగితే పోలీసులకు నివేదించాలని సిఫార్సు చేసింది. 2006లో సుప్రీంకోర్టు ర్యాగింగ్ను నిరోధించడానికి మార్గాలు, పద్ధతులను సూచించడానికి సిబిఐ డైరెక్టర్ 'డాక్టర్ రాఘవన్' ఆధ్వర్యంలో మరొక కమిటీని ఏర్పాటు చేసింది. 2007 ఆర్.కె. రాఘవన్ కమిటీ నివేదిక ర్యాగింగ్ను మానసిక వ్యాధిగా అభివర్ణించింది. దాని నిషేధం, నివారణ చర్యల అమలు రెండింటినీ సిఫార్సు చేసింది. ర్యాగింగ్కు పాల్పడే వ్యక్తులపై తీసుకోగల చర్యలను, దీనిని అరికట్టడంలో విఫలమైన సంస్థలపై సాధ్యమయ్యే చర్యలను సూచించడం మొదలైన పలు కీలక అంశాలను స్పృశిస్తూ ర్యాగింగ్కు మానసిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సహా అనేక అంశాలు ఉన్నాయని, ఇది ఉన్నత విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. పాఠశాల దశ నుంచే మానవీయ విలువలను పెంపొందించడంలో మన వైఫల్యం ర్యాగింగ్గా పరిగణించ బడుతుందని పేర్కొంది. క్యాంపస్లలో ర్యాగింగ్ కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి యుజిసి ఉన్నత విద్యా సంస్థల్లో ర్యాగింగ్ ముప్పును అరికట్టడానికి కొన్ని నిబంధనలను 2009లో తీసుకువచ్చింది. ఈ నిబంధనలను అన్ని ఉన్నత విద్యా సంస్థలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. ర్యాగింగ్ చేసిన వారు దోషులుగా తేలితే వారిపై తీసుకోవలసిన చర్యలను సూచించింది. అవి తరగతులకు హాజరుకాకుండా సస్పెన్షన్లు చేయొచ్చని, స్కాలర్షిప్ లేదా ఫెలోషిప్, ఇతర ప్రయోజనాలను ఉపసంహరించుకోవచ్చని, పరీక్షలకు హాజరు కాకుండా డిబార్ చేయొచ్చని, పరీక్షల ఫలితాలను నిలిపేయొచ్చని, సంస్థ నుండి బహిష్కరణ తత్ఫలితంగా నిర్ణీత వ్యవధిలో ఏదైనా ఇతర సంస్థలో ప్రవేశం నుండి డిబార్ చేయడం వంటివి ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1997లో ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేద చట్టాన్ని ప్రవేశపెట్టింది. విద్యాసంస్థలు, కళాశాలు, విద్యను బోధించే ఏ సంస్థ అయినా, విద్యార్థి వసతిగృహం, ట్యుటోరియల్ కాలేజీ, రోడ్లు, బస్సులు ఆగే ప్రాంతం, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వైద్యశాల వంటి ప్రదేశాలన్నింటిలోనూ ర్యాగింగ్ జరపటం నేరంగా పేర్కొంది. ర్యాగింగ్ సందర్భంలో మరణించటం జరిగిన లేదా ఆ విద్యార్థి ఆత్మహత్యకు లోనైనా నేరస్తునికి జీవిత ఖైదు లేదా 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష, 50,000 రూపాయలవరకు జరిమానా విధింపబడతాయని తెలిపింది.

## కృత్రిమ మేధో విప్లవం -సన్నద్ధత ముఖ్యం

రానున్న కాలం కృత్రిమ మేధ దే. ప్రపంచాన్ని పాలించబోతోంది.అందుకు తగ్గట్టుగా సన్నద్ధత చూపని దేశం వెనక బడక తప్పదు.అదే సమయంలో దాన్ని విశ్వ మానవ శ్రేయస్సు కి పూర్తిగా ఉపయోగపడేలా జాగ్రత్త వహించాలి.అందులో భాగంగా ఏభైకి పైగా దేశాలు కలిసి ఒక సదస్సు ఫ్రాన్స్ లో నిర్వహించాయి.అందులో ముఖ్య భూమిక భారత్ తీసుకుంది.రెండో సమావేశం భారత్ లో జరపబోతున్నట్లు ప్రకటించింది. ఎందుకీ సన్నద్ధత అంటే కృత్రిమ మేధ సంబంధిత విజ్ఞానం ఏ ఒక్కరి దగ్గరో పోగుపడి వారి స్వార్ధానికే ఉపయోగ పడేలా కాకుండా అందరికీ అందడానికి.మేలైన పరిశోధనలు జరిగి,ఆ ఫలాలు ఉమ్మడిగా పొందడానికి.ఇంతవరకూ అమెరికా కృత్రిమ మేధ పరిశోధనల్లో ముందుంది.చాట్ జీపీటీ ద్వారా ప్రపంచానికి ఆ విజ్ఞాన ఫలాన్ని పరిచయం చేసినా,పరిశోధన కొనసాగేందుకు వీలైన సమాచారాన్ని,సాంకేతికత ను మిగతా దేశాలకు దూరంగా ఉంచింది.లేదా బాగా ఖరీదైన వ్యవహారం గా ఉంచింది.ఎప్పుడైతే దానికి పోటీగా చైనా డీప్ సీక్ పేరుతో రంగంలోకి వచ్చిందో,పైగా అతి చౌకగా అదే స్థాయిని సాధించడమే కాకుండా,సాంకేతిక సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచిందో అమెరికా పెత్తనం చేజారింది. ఇప్పుడు భారత్ సహా మిగతా దేశాలన్నీ కోరుతున్నది ఇదే.పరిశోధనకు అవసరమైన విజ్ఞానం అన్ని దేశాలకు లభ్యమై ఉండాలి.తద్వారా పేద దేశమైనా ఆ రంగంలో ప్రగతి సాధించ గలగాలి.ప్రయోజనాలు అధికంగా,ఉమ్మడిగా పొందడానికి అవకాశం ఉండాలి తప్పితే ఏ ఒక్కరి చేతిలోనో బందీ కారాదు.ఇక కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది.నిజమే చాలా వరకూ పోతాయి.అదే సమయంలో కొత్త ఉద్యోగాలు వస్తాయి.కొత్త నైపుణ్యాల్ని అందిపుచ్చు కోవాల్సి ఉంటుంది. పవర్ లూమ్ వచ్చాక చరఖాలు మూలపడినట్లు చాలా రంగాల్లో చాలా మార్పులు వస్తాయి.వాటికి తగ్గట్టుగా మారాల్సిందే.చేయాల్సిన పని రూపు మారుతుంది. భారం తగ్గి ఉత్పాదకత, సౌకర్యం పెరుగుతాయి.అదే సమయంలో యంత్రం దానికి ఇచ్చిన ఫీడ్ బట్టే, ఫలితాన్ని ఇస్తుంది.తప్పుడుగా ఇస్తే,తప్పుడు ఫలితాలు.ఆ రకమైన తప్పులు లేని వ్యవస్థ,అందుకు తగ్గ ఉమ్మడి నియమాలు,నియంత్రణఏర్పరుచుకోవాలని ప్రధాని పిలుపిచ్చారు.అయితే ఈ పిలుపు కి అమెరికా,బ్రిటన్ ఊకొట్టకపోవడం విశేషం.ఇంకా ఏదీ లేకముందే పెత్తనం పోతుందని బాధ.భారత్ తో సహా మిగతా దేశాలు తత్సంబంధిత పరిశోధనలకు పెద్దపీట వెయ్యడమే కాకుండా కలిసి ముందుకు సాగాలి.

**డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ.,**
**9440836931**

# రాష్ట్రపతి పాలనతో మణిపూర్ అగ్నిగుండం చల్లారేనా?



**(తేజస్వి - హైదరాబాద్)**

- అక్కడి హింసకు ప్రధాన కారణంగా సిఎం పేరు వెలుగులోకి
- మైతేయులకు కూడా ఎస్టి లలో చేర్చేలా హైకోర్టు ఆదేశాలు
- దీంతో మైతేయులు-కుకీలు పరస్పర దాడులు
- ఆయుధాలను ఎత్తుకెల్లనివ్వమని మైతేయులకు సలహా ఇచ్చారని ఆరోపణ
- ఈ క్రమంలోనే బిరేన్ సింగ్ తో రాజీనామా చేయించిన బిజెపి
- అయినా పరిస్థితులు మారక పోవటంతో రాష్ట్రపతి పాలన వైపు అడుగులు
- జాతుల మధ్య రేగిన ఘర్షణల నుంచి పరిస్థితి మారేదెన్నడో?

ఇప్పుడు దేశమంతా చర్చనీయాంసంగా మారిన విషయం మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధించడం. మణిపూర్ లో దీర్ఘకాలికంగా చెలరేగుతున్న హింస, ఆ హింసకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఒక కారణం అన్న ఆరోపణ, మొత్తానికి మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా, తర్వాత ఇంకా ప్రభుత్వం కొనసాగే అనుకూల వాతావరణం ఎటువైపు నుండి చూసినా కనిపించకపోవడంతో మొత్తానికి ఇప్పుడు రాష్ట్రపతి పాలన కిందకి వచ్చింది మణిపూర్ రాష్ట్రం. ఈ సందర్భంలో కొంత మణిపూర్ లో ఈ హింస జరిగిన పరిస్థితులు, దీనికి బిరెన్ సింగ్ రాజీనామాకు ఉన్న సంబంధం, ఈ రాష్ట్రపతి పాలన గురించి చూద్దాం. మణిపూర్ ముఖ్యమంత్రి గత ఆదివారం బిరెన్ సింగ్ రాజీనామా చేసారు. రాష్ట్రంలో జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణను ఆయన ప్రేరేపించినట్టు నిరూపించే ఆడియో బయటపడటం,దానిలో స్వరానికి,ఆయన స్వరానికి 93 శాతం సారూప్యం ఉన్నట్టు ట్రూత్ ల్యాబ్స్ ఇచ్చిన నివేదిక నిర్ధారించడంతో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆడియో లీక్ అంశంపై సుకి ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీమ్ కోర్టును ఆశ్రయించగా విచారణ జరుగుతోంది. బిరెన్ పై పార్లమెంట్ లో అవిశ్వాస తీర్మానం కూడా ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ సిద్ధం అయ్యింది . సొంత పార్టీలోనే ఆయన మీద వ్యతిరేకత తలెత్తింది. ఇరవై మంది సొంత ఎమ్మెల్యేలే ఆయనను వ్యతిరేకించారు. దీనికి తోడు స్పీకర్ కి, బిరెన్ సింగ్ కి అస్సలు పడదు. ఈ సందర్భంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే పరువు పోతుందని భావించిన బిరెన్ సింగ్ రాజీనామా చేసారు. రాజీనామా చేసే ముందు బిరెన్ సింగ్ కేంద్ర మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జే.పి.నడ్డాను కలిసారు. వారి ఆదేశాల మేరకే పదవి నుండి తప్పుకున్నారు. మేతేయి వర్గానికి చెందినా బిరెన్ సింగ్ ఆ వర్గానికి మద్దతుగా మాట్లాడిన ఆడియో బహిరంగమయ్యింది. ఇందులో కేంద్ర హోం మంత్రి ప్రస్తావన కూడా ఉంది. మైతేయులను ప్రభుత్వం దగ్గర ఉన్న ఆయుధాలను ఎత్తుకెల్లనివ్వమని బిరెన్ సింగ్ అధికారులకు ఆదేశించారని ఆరోపణ.

రెండేళ్లుగా మణిపూర్ లో హింసాత్మక సంఘటనలు జరుగుతున్నా బిరెన్ సింగ్ వాటిని నియంత్రించలేకపోయారు. దానికి తోడు ఆ హింసను ఆపకపోగా ఆ హింసకు మరింత ఆజ్యం పోసారన్న అపవాదు తెచ్చుకున్నారు. బిరెన్ సింగ్ రాజీనామా ఇప్పటికే ఆలస్యం అయ్యిందని,అయితే రాజీనామా చేయాల్సింది కేంద్ర హోం మంత్రి అమిత్ షా అని కాంగ్రెస్ విమర్శించింది. కాంగ్రెస్ సీనియర్ నేత జయరాం రమేష్ ఈ విషయం గురించి మాట్లాడుతూ,రెండేళ్లుగా హింస జరుగుతున్న ప్రధాని మోది ఎందుకు మణిపూర్ లో ఇప్పటివరకు పర్యటించలేదని, అమిత్ షా సమస్యను పరిష్కరించాలేకపోయారు అని ప్రశ్నించారు. మణిపూర్ లో రెండేళ్లుగా మైతేయులు -కుకిల మధ్య ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి.దానికి కారణం మణిపూర్ హై కోర్ట్ మైతేయులకు కూడా ఎస్టి లలో చేర్చే ప్రతిపాదనను పరిగణించాలని ఆదేసించడమే. అది హింసాత్మక పరిణామంగా దారి తీసి వందలాది మంది మరణించారు, వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. అయితే ఈ అల్లర్లలో మైతేయులను బిరెన్ సింగ్ ప్రేరేపిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. 2023 మే 3 న మైతేయులు-కుకీలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇళ్ళను తగలబెట్టుకున్నారు. ఇరు తెగల మధ్య దాదాపు యుద్ధమే జరిగింది. అప్పటినుండి ఆ హింస రావణకాష్టంలా రగులుతూనే ఉంది. ముఖ్యమంత్రి బిరెన్ సింగ్ రాజీనామాతో ఎమ్మెల్యేలు కాస్త శాంతించారు. అరవై మంది సభ్యులు ఉన్న మణిపూర్ అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేలు 37 మంది. నాగా పీపుల్స్ ఫ్రంట్ కు ఐదుగురు, జేడియుకి చెందిన ఒక సభ్యుడు ఉన్నారు. అయితే నాగా పీపుల్స్ ఫ్రంట్ కి బిరెన్ సింగ్ అంటే సుతారమూ ఇష్టం లేదు. అందుకే వారు బిరెన్ సింగ్ రాజీనామాను స్వాగతించారు.

ఈశాన్య భారతంలో ఒక రాష్ట్రమైన మణిపూర్ జనాభా 33 లక్షలు మయన్మార్ సరిహద్దు ఉన్న రాష్ట్రంలో మైదాన ప్రాంతంలో ఉండే మైతేయులదే ఆధిపత్యం. కుకీలు కొండల్లో ఉంటారు. భూమి కోసం, ఉద్యోగాల కోసం ఈరెండు వర్గాలు పోరాడుతున్నాయి. మైతేయుల్లో ఎక్కువమంది హిందువులు. కూకిలలో ఎక్కువ మంది క్రిస్టియన్లు ఉన్నారు. నాగ తెగ ప్రజలు కూడా ఉన్నా వారికి ఎక్కువ ప్రాముఖ్యత లేదు. కూకీలలానే తమను కూడా ఎస్టి జాబితాలో చేర్చాలని మైతేయులు పోరాడుతున్నారు. ఇప్పటికే ఈ రెండు తెగల మధ్య జరిగిన హింసలో వందల మంది మరణించగా వేల సంఖ్యలో శిబిరాల్లో ప్రజలు తలదాచుకుంటున్నారు. ఇంకో పక్క మణిపూర్ లో మైతేయుల జనాభా ఎక్కువ. వీరంతా లోయలో నివసిస్తారు. రాష్ట్రంలో సగానికి పైగా మైతేయులే ఉన్నారు. కూకీలు,నాగాలు కలిపితే 43 శాతం. అందులోను బిరెన్ సింగ్ కూడా మైతేయి వర్గానికి చెందిన వారే.అందుకే ఆయన వారి తరపునే మాట్లాడేవారని మైతేయుల వాదన. తమను కూడా ఎస్టిలలో చేరిస్తే తాము కూడా కొండల్లో భూములు కొనుగోలు చేస్తామని మైతేయులు అంటున్నారు.

మొత్తానికి ఈ ఘట్టానికి ఒక తాత్కాలిక పరిష్కారంగా రాష్ట్రపతి పాలన విధించబడింది. భారత రాజ్యాంగంలో 356 ఆర్టికల్ కింద రాష్ట్రపతి పాలన విధించవచ్చు. గవర్నర్ రిపోర్ట్ ఉన్నా లేకపోయినా రాష్ట్రపతి కనుక ఒక రాష్ట్రం రాజ్యాంగబద్ధంగా నడవటం లేదని అనుకుంటే అక్కడ రాష్ట్రపతి పాలన అమలు చేయవచ్చు. ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తే అది మూడేళ్ళ వరకు కొనసాగవచ్చు. ఒక సంవత్సరం తర్వాత ఎలక్షన్ కమిషన్ అక్కడ ఎన్నికలు జరిపే పరిస్థితి లేదని ధ్రువీకరించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పార్లమెంట్ ఈ రాష్ట్రపతి పాలనను ఆమోదించాలి. నిజానికి మణిపూర్ లో హింస,మానవ హక్కుల ఉల్లంఘన, స్త్రీల హక్కుల ఉల్లంఘన జరిగింది. ఇప్పటికే మణిపూర్ లో పదకొండు సార్లు రాష్ట్రపతి పాలన విధించారు. నిజానికి ఈ రాష్ట్రపతి పాలన రెండేళ్ళ క్రితమే విధించాల్సింది. ఇప్పటికే అనేక సార్లు రాష్ట్రపతి పాలనలో ఉన్నప్పటికీ కూడా మణిపూర్ అగ్నిగుండంలా ఉంది. ఇక ఈసారి రాష్ట్రపతి పాలన అయినా ఏమైనా ఈ పరిస్థితిలో మార్పు తెస్తుందేమో వేచి చూడాల్సిందే!

# ఉచితాలకు ఇకనైనా బ్రేకుపడేనా?



**కింజరాపు అమరావతి**
**8247286357**

- రాజకీయ పార్టీల వ్యవహారాలపై సుప్రీం ఆగ్రహం
- ప్రలోభాలతో దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కుగుతోందని వ్యాఖ్యలు
- అనుచితాలతో ప్రభుత్వాలకు ఆర్థిక ఇబ్బందులు
- ప్రజలకు పనికల్పించాల్సిన అవసరం ఉందన్న ధర్మాసనం
- నిరాశ్రయులను సమాజంలో ప్రధాన స్రవంతిలో చేర్చాలని సూచన

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే సంస్కృతిని తప్పుపడుతూ దేశ సర్వోన్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ నెల 12 నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నగదు బదిలీ పథకాలు, ఉచిత రేషన్, డబ్బు అందుతున్నందున ప్రజలు పనిచేయడానికి ఇష్టపడకుండా ఉండటానికి ఈ పద్ధతిని అనుమతిస్తుందని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే హక్కుకు సంబంధించిన కేసును విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఎన్నికలకు ముందు ఉచితాలు ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేసింది. దురదృష్టవశాత్తూ ఈ ఉచితాల కారణంగా... పని చేయడానికి ప్రజలు సుముఖంగా లేరు. వారికి ఉచిత రేషన్ అందుతోంది. వారు ఏ పనీ చేయకుండానే డబ్బులు తీసుకుంటున్నారు' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. నిరాశ్రయులను సమాజంలో ప్రధాన స్రవంతిలో చేర్చి దేశాభివృద్ధికి దోహదపడేలా చూడాలని ధర్మాసనం అభిప్రాయపడింది. దేశాభివృద్ధికి తోడ్పడటం ద్వారా వారిని ప్రధాన స్రవంతిలో భాగం చేయడానికి అనుమతించడానికి బదులు, పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించడం లేదా ? ధర్మాసనం ప్రశ్నించింది. మహారాష్ట్రలోని రైతుల కు కూలీలు దొరకడం లేదని, వారికి ఇంట్లో ఉచితంగా సరుకులు అందుతున్నాయని జస్టిస్ బీఆర్ గవాయ్ తన వ్యక్తిగత అనుభవాన్ని వివరించారు. అభివృద్ధి కోసం ప్రజలను సమాజంలో విలీనం చేయాలని సూచించారు. ఇలాంటి పరిస్థితులలో అటు రాజకీయ పార్టీలు, ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమయింది. ఇటువంటి ప్రలోభాలు దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని తెలుసుకోవాలి. వీటివలన అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు కూడా ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడతాయి. ఉచితాల వలన్ మిగిలిన అభివృద్ధి కార్యక్రమా లకు నిధులు కేటాయించడం కష్టం. ఇటువంటి పరిస్థితులలో గతంలో సుప్రీంకోర్టు ఎన్నిక మేనిఫెస్టోల విషయంలో ఇచ్చిన మార్గదర్శకాలు ఏమిటి..? మొదలైన వాటికోసం పరిశీలిద్దాం.

**సుప్రీంకోర్టు ఆదేశాలు :** యస్. సుబ్రమణ్యం బాలాజీ వెర్సెస్ తమిళ నాడు ప్రభుత్వం కేసులో 5 జూలై 2013న గౌరవ సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సంప్రదించి ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలకు మార్గదర్శకాలను రూపొందించాలని తన తీర్పులో ఆదేశించింది. మార్గదర్శకాలను రూపొందించడానికి మార్గదర్శక సూత్రాలును తెలిపింది. "ఎన్నికల మ్యానిఫెస్టోలోని వాగ్దానాలను ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం అవినీతి ఆచరణగా భావించలేమని చట్టంలో స్పష్టంగా ఉన్నా ఏ రకమైన ఉచితాల పంపిణీ అయినా నిస్సందేహంగా ప్రజలందరినీ ప్రభావితం చేస్తుందనే వాస్తవాన్ని తోసిపుచ్చలేమని, ఇది స్వేచ్ఛాయుతమైన న్యాయమైన ఎన్నికల మూలాన్ని పెద్ద స్థాయిలో కదిలిస్తుందని, ఎన్నికల ప్రక్రియ యొక్క స్వచ్ఛత దెబ్బతినకుండా చూసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి లభించిన అధికారాల ద్వారా గతంలో మోడల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం ఆదేశాలు జారీచేసిందని, రాజకీయ పార్టీలు ఎన్నికల తేదీని ప్రకటించకముందే తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తారనే వాస్తవాన్ని గౌరవ సుప్రీం కోర్టు గుర్తించిందని, ఎన్నికల ప్రకటనకు ముందు చేసే ఏ చర్యనైనా నియంత్రించే అధికారం ఎన్నికల కమిషన్కు ఉన్నప్పటికీ ఎన్నికల మేనిఫెస్టో ఉద్దేశ్యం నేరుగా ఎన్నికల ప్రక్రియతో ముడిపడి ఉన్నందున ఈ విషయంలో మినహాయింపు ఇవ్వవచ్చని " సుప్రీంకోర్టు తెలిపింది.

**ఎన్నికల సంఘం సూచనలు :** గౌరవ సుప్రీం కోర్టు యొక్క ఆదేశాలను స్వీకరించిన తరువాత ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించి వారి వైరుధ్య అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న పిదప స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ఎన్నికల ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంటు లేదా రాష్ట్రానికి ఏదైనా ఎన్నికల కోసం ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేసేటప్పుడు పాటించవలసిన నియమాలను ప్రవర్తనా నియమావళిలో 8 వ భాగంలో మేనిఫెస్టోను చేర్చుతూ 2015 ఏప్రిల్ 24న కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో ఎన్నికల మేనిఫెస్టోలో అంశాలు రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆదర్శాలు సూత్రాలకు విరుద్ధంగా ఏవీ ఉండకూడదని, మోడల్ ప్రవర్తనా నియమావళిలోని ఇతర నిబంధనల స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలని, రాజ్యాంగంలో పొందుపరచబడిన రాష్ట్ర విధాన నిర్దేశక సూత్రాలు పౌరుల కోసం వివిధ సంక్షేమ చర్యలను రూపొందించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తున్నాయి కాబట్టి ఎన్నికల మేనిఫెస్టోలలో అటువంటి సంక్షేమ చర్యల వాగ్దానానికి ఎటువంటి అభ్యంతరం ఉండదని, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రక్రియ యొక్క స్వచ్ఛతకు భంగం కలిగించే లేదా తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఓటర్లపై అనవసరమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్న వాగ్దానాలు చేయడం మానుకోవాలని, మ్యానిఫెస్టోలు వాగ్దానాల హేతుబద్ధతను కలిగి ఉండాలని, నెరవేర్చడానికి సాధ్యమయ్యే హామీలపైనే ఓటర్ల విశ్వాసాన్ని కోరాలని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126 ప్రకారం నిర్దేశించినట్లు నిషేధిత కాలంలో మేనిఫెస్టో విడుదల చేయకూడదని, ఒకేవిడత ఎన్నికల విషయంలో పోలింగ్కు ముందు అమలుచేసే నిషేధాజ్ఞల కాలవ్యవధిలో మేనిఫెస్టోలు ప్రకటించరాదని, ఒకటికంటే ఎక్కువ విడతల్లో ఎన్నికలు జరిగితే ప్రతి విడత పోలింగ్కు ముందు ప్రకటించే నిషేధాజ్ఞల వ్యవధిలో మేనిఫెస్టోలు విడుదల చెయ్యకూడదని, ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన మూడు రోజుల్లోగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి రాజకీయ పార్టీలు అభ్యర్థులు తప్పనిసరిగా ఆంగ్ల హిందీ భాషల్లో మూడు ప్రతులు సమర్పించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళిలోని 8వ భాగంలో పేర్కొన్న విధివిధానాలకు అనుగుణంగానే మేనిఫెస్టోలో హామీలు, కార్యక్రమాలు, విధానాలు పొందుపర్చినట్టు డిక్లరేషన్ సైతం మేనిఫెస్టోతో పాటు ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఎన్నికల కమీషన్ తెలిపింది. ఇంకా రాజకీయపార్టీల ఎన్నికల మేనిఫెస్టోలను భవిష్యత్ అవసరాల కోసం ఎన్నికల సంఘం భద్రపరుస్తుందని 2016 డిసెంబర్ 27న ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులలో తెలిపింది.

# అమెరికా అభ్యంతరాలతో.. అయోమయంలో భారత్ యువత...!

- భారత్పై విషం చిమ్ము తున్న తెల్లదొరల దేశం
- చదువుకోసం వస్తే... సదువుకోండన్న అమెరికా అధ్యక్షుడు
- పార్ట్ టైం మాటున ఉద్యోగం అంటే సహించబోమని ప్రకటన
- ఇప్పటికే అక్రమంగా నివాసముంటున్నారంటూ పలువురి భారతీయుల గెంటివేత
- ప్రత్యేక సైనిక విమానాలలో భారత్ కు తరలిస్తున్న అమెరికన్ అధికారులు



**వి.వి.వెంకటేశ్వరరావు**
**63008 66637**

**(నిన్నటి సంచిక తరువాయి)**

ఇది మే 2024లో 7 నుండి గణనీయమైన పెరుగుదలను నమోదు చేసుకుంది. దీంతో భారతదేశం జీ-20 దేశాల నిరుద్యోగుల రేటులో మూడవ స్థానంలో ఉంది. భారతదేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగ రేటు పెరుగుతూ వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 2024 మే నెలలో 6.3 శాతం నుండి జూన్ నాటికి 9.3 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాలలోని నిరుద్యోగుల రేటు మే నెలలో 8.6 శాతం నుండి జూన్ నాటికి 8.9 శాతానికి పెరిగింది. కార్మిక భాగస్వామ్య రేటు (లేబర్ పార్టనర్షిప్ రేట్) మే నెలలో 40.8 శాతం ఉండగా, జూన్ నాటికి 41.4 శాతానికి పెరిగింది. 2024 జూన్లో ఉపాధి రేటు 38 నుండి 37.6 శాతానికి తగ్గుముఖం పట్టింది. నిరుద్యోగ సమస్యను అధిగమించడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధికి అస్కారం కల్పిస్తూ.. రుణసదుపాయాలను ఏర్పాటు చేసింది. అలాగే విద్యావంతులైన వారికి మరిన్ని మెరుగైన అకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక ఉద్యమానికి నాంది పలికింది. వికసిత్ భారత్, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలతో కేంద్రం నిరుద్యోగులైన నైపుణ్యం కలిగిన యువతీ యువకులు పెద్దమొత్తంలో రుణసదుపాయాలు కల్పిస్తూ.. ఉపాధిని ప్రోత్సహిస్తోంది. తద్వారా నిరుద్యోగ సమస్యను నిర్మూలించవచ్చుననే సంకల్పానికి మార్గం సులభతరమైంది.

తాజా పరిస్థితులతో భారత్లో మరోసారి నిరుద్యోగ సమస్య పెరిగే అవకాశం, ప్రమాదం కూడా ఉందనే ఆందోళన ఉప్పుడు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకవైపు ఎన్నో ఆశలు పెట్టుకొని.. ఎంతో వ్యయప్రయాసలతో అమెరికా వెళ్లిన యువతకు.. ఆదేశ అధ్యక్షుడు ట్రంప్ ఆకస్మిక నిర్ణయం విస్మయం కలిగించడంతోపాటు.. భయాందోళలను కూడా రేకెత్తించాయి. దీంతో ఇప్పటికే వేలాది మంది యువతీ యువకులు పార్టైమ్ ఉద్యోగాలకు గుడ్బై చెప్పి.. బుద్ధిగా చదువుకోవడానికి నిర్ణయించుకున్నారు. అయితే.. కుటుంబ అవసరాలకో.. లేక.. ఆర్థిక పరిస్థితిను మెరుగుపరుచుకోవడానికి అగ్రరాజ్యానికి అప్పులు చేసుకొని వెళ్లి.. పార్టైమ్ ఉద్యోగాలు చేస్తున్న వారే ఇప్పుడు తీవ్రమైన ఇబ్బందుల్లో పడ్డారు. వారే మాతృదేశానికి తిరిగి వచ్చేస్తున్నారు.. ఇలా వచ్చిన వారికి ఉపాధి అవకాశాల మాటేంటి..? అనేది మన ముందున్న ప్రశ్న.

**స్టార్టప్ నెలకొల్పడానికి ప్రభుత్వం చేయూత ఇస్తే చాలు...!**

అమెరికా నుండి తిరిగి స్వదేశానికి వచ్చేస్తున్న వారి వివరాలు ఎలాగూ ప్రభుత్వం చేతిలో ఉంటాయి కాబట్టి.. అలాంటి వారికి తక్షణమే కేంద్ర ప్రభుత్వం లేదా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిచ్చి వారిని అక్కున చేర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

ఒకవైపు అమెరికా అధికారుల వేధింపులతో తీవ్ర ఇబ్బందులు పడి.. భయాందోళన మధ్య తిరిగి వచ్చిన వారి నైపుణ్యాన్ని పరిశీలించి.. పరిగణలోకి తీసుకొని వారితో స్టార్టప్ కంపెనీలు నెలకొల్పడానికి ముందుకు రావడం ఎంతో అవసరం. అలా చేయడం వల్ల కేవలం ఒకరిద్దరు మాత్రమే కాకుండా స్టార్టప్ కంపెనీల ద్వారా వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ఆస్కారం ఉంటుంది. మరోవైపు అప్పులు చేసో.. ఆస్తులు తాకట్టుపెట్టో అమెరికా వెళ్లినవారు తిరిగి వచ్చేస్తే.. వారికి కొంత సమయాన్ని ఇచ్చి.. స్టార్టప్ కంపెనీలు మార్కెట్లో నిలదొక్కుకునేంత వరకూ రుణాల వసూళ్లపై తక్కువ వడ్డీని వసూలు చేయడం ద్వారా పూర్తి స్థాయిలో వారిని ఆదుకున్నట్లు అవుతుంది. ఇబ్బందుల్లో ఉన్నవారికి చేయూతనిచ్చినట్లు అవుతుంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకోవడం


పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

సూర్య
హైదరాబాద్
శనివారం
15 ఫిబ్రవరి 2025


# 'డ్రాప్ బాక్స్' రూల్స్ కఠినతరం

**హెచ్-1బీ రెన్యువల్ కు ఇక ఎదురుచూపులే..!**

**పర్యాటక వీసాల రెన్యువల్ కోసం వేచి ఉండాల్సిందే.**

వాషింగ్టన్ : అమెరికా వీసా రెన్యువల్ చేయాలనుకునే వారికి చేదు వార్త..! వీసాల పునరుద్ధరణ కోసం తీసుకొచ్చిన 'డ్రాప్బాక్స్' నిబంధనలను అగ్రరాజ్యం కఠినతరం చేసినట్లు తెలుస్తోంది. ఇకపై ఈ విధానం కింద గత 12 నెలల్లో గడువుతీరిన వీసాలను మాత్రమే ఇంటర్వ్యూ లేకుండా రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంటుంది. అంతకుముందు 48 నెలల కాలానికి ఈ సదుపాయం అందుబాటులో ఉండేది. తాజా నిబంధనలను తక్షణమే అమల్లోకి తెచ్చినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడనప్పటికీ.. ఇప్పటికే వీసా అప్లికేషన్ కేంద్రాల్లో కొత్త రూల్స్ ను అమలు చేస్తున్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. తాజా నిబంధనలతో హెచ్-1బీ సహా బీ1/బీ2 వంటి నాన్ఇమిగ్రెంట్ వీసాదారుల దరఖాస్తులపై తీవ్ర ప్రభావం పడనుంది. వీరు వీసా రెన్యువల్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఉన్న నిబంధన ప్రకారం.. గత 48 నెలల్లో వీసా గడువు ముగిసినవారు రెన్యువల్ కోసం డ్రాప్బాక్స్ విధానంలో దరఖాస్తు చేసుకునే వీలుండేది. అలాంటివారికి ఎలాంటి ఇంటర్వ్యూ ఉండదు. ఇప్పుడీ నిబంధనను మారుస్తూ గత 12 నెలల్లో వీసా గడువు ముగిసినవారికి మాత్రమే డ్రాప్బాక్స్తో రెన్యువల్ చేసేందుకు అనుమతి కల్పిస్తున్నారు. అంటే వీసా గడువు తీరి సంవత్సరం దాటినవారు రెన్యువల్ కోసం మళ్లీ వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలకు హాజరవ్వాల్సిందే..! అక్రమ వలసదారులను వెనక్కి తీసుకొస్తాం: అమెరికాలో మోదీ కీలక వ్యాఖ్యలు వాస్తవానికి కొవిడ్ ముందు వరకు ఇంటర్వ్యూ లేకుండా వీసా పునరుద్ధరణ కోసం ఈ 12 నెలల నిబంధనే అమల్లో ఉండేది. ఆ తర్వాత వీసా మంజూరు, రెన్యువల్కు పడుతున్న సమయాన్ని దృష్టిలోపెట్టుకొని 2022లో ఈ 'డ్రాప్బాక్స్' విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అప్పటినుంచి గత 48 నెలల్లో గడువు పూర్తయిన వారు కూడా ఇంటర్వ్యూ లేకుండా రెన్యువల్కు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. ఇప్పుడు ట్రంప్ సర్కారు దీన్ని మళ్లీ పాత పద్ధతికి తీసుకొచ్చింది.

**భారతీయులపైనే అధిక ప్రభావం..**

తాజా మార్పులతో భారత దరఖాస్తుదారులకు వీసా రెన్యువల్ మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే దిల్లీ, ముంబయి వంటి ప్రధాన నగరాల్లో బీ1/బీ2 వంటి వీసా దరఖాస్తుదారులు ఇంటర్వ్యూ అపాయింట్మెంట్ల కోసం 440 రోజులకు పైగా నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు మరింత ఎక్కువమంది ఇంటర్వ్యూలకు వస్తే ఈ వీసాల జారీ ఇంకా ఆలస్యం కానుంది. డ్రాప్బాక్స్పై ఆధారపడుతున్న బిజినెస్ ట్రావెలర్స్, వృత్తినిపుణులు వీసాల (హెచ్-1బీ) పునరుద్ధరణకు ఇంటర్వ్యూ స్లాట్ల కోసం ఎదురుచూడాల్సివస్తుంది.




# సుంకాలు తగ్గించలేం

- ప్రధాని మోడీకి తేల్చి చెప్పిన ట్రంప్
- న్యూఢిల్లీ పన్నులు తగ్గిస్తే.. తాము అదే పని చేస్తామని సూచన
- తగ్గేదేలే అని సున్నితంగా ప్రధాని వినతి తిరస్కరణ
- అధునాతన ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు సిద్ధం
- భారత్‌కు మిలిటరీ ఉత్పత్తుల విక్రయాలను పెంచుతామన్న ట్రంప్
- మనం కలిస్తే మెగా గామారుతామన్న భారత ప్రధాని మోడీ
- అక్రమ వలసదారులకు దేశంలో ఉండే హక్కు రాద ని వ్యాఖ్యలు

వాషంగ్టన్ : అక్క అక్కే.. లెక్క లెక్కే అన్నటుంది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి. భారత్ ఎంత మిత్ర దేశమైనా.. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా నేడు శ్వేతసౌధంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రెసిప్రోకల్ టారిఫ్ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు.

"ప్రస్తుతం మేము రెసిప్రోకల్ నేషన్ (ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం). భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్లు వేస్తాము. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే ఛార్జి చేస్తాము. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్లపై చర్చించాము. కానీ, ఎలాంటి రాయితీలు పొందలేకపోయాం. అందుకే మేము తేలికైన మార్గాన్ని ఎంచుకొన్నాం. వారెంత విధిస్తే.. మేము అంతే ఛార్జి చేస్తాం. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య.

మాకు ఐరోపా అత్యంత సమస్యాత్మకం. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో మాపై పన్నులు విధిస్తున్నారు. వారు చాలా విషయాల్లో అడ్వాంటేజ్ తీసుకొంటున్నారు. ఆ చర్యలతో మేము ఏమాత్రం సంతృప్తిగా లేము.

ఇక చైనా విషయం మరింత భయంకరం. నేను అధికారంలోకి రాక ముందు కనీసం 10శాతం కూడా పన్ను విధించేవారు కాదు. నేను తొలిసారి పగ్గాలు చేపట్టినప్పుడు వారి నుంచి వందల బిలియన్ డాలర్లు పన్నుల రూపంలో వసూలు చేశాం. మేము సరిగ్గా ఎలా చేయాలో అలానే చేశాము" అని ట్రంప్ వివరించారు. మోదీ-ట్రంప్ పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్ల దాటించే లక్ష్యంతో మిషన్-500ను ప్రకటించారు.

ఇక మోదీ పర్యటన రోజే పరస్పర టారిఫ్ల విషయాన్ని ట్రంప్ ముందుగానే తెరపైకి తెచ్చి బలమైన సంకేతాలు పంపారు. "మూడు అద్భుతమైన వారాలు. ఇప్పటివరకు అత్యుత్తమైనవి కావచ్చు. కానీ, "నేడు మాత్రం అత్యంత ముఖ్యమైంది. రెసిప్రోకల్ టారిఫ్స్" అంటూ నర్మగర్భ వ్యాఖ్యలను పోస్టు చేశారు. మోదీతో భేటీకి కొద్ది గంటల ముందే.. అన్ని దేశాలపై పరస్పర సుంకాలను అమలు చేస్తూ.. ఫైల్పై సంతకం చేశారు.

మరో వైపు సరిహద్దుల్లో చైనాతో ముప్పు పొంచిఉన్న వేళ.. భారత రక్షణరంగాన్ని మరింత బలోపేతం చేసేలా కీలక ప్రకటన వెలువడింది. న్యూదిల్లీకి అధునాతన ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. ఆయనతో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య, దౌత్య సంబంధాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారం వంటి అంశాలపై దేశాధినేతలు చర్చించుకున్నారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

"అమెరికా-భారత్ కోసం అద్భుతమైన వాణిజ్య ఒప్పందాలు చేసుకోబోతున్నాం. సమీప భవిష్యత్తులోనే భారీ ఒప్పందాన్ని ప్రకటిస్తాం. అమెరికాలో ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్ను భారత్ మరింతగా కొనుగోలు చేస్తుంది. ఈ ఏడాది నుంచి భారత్కు మిలిటరీ ఉత్పత్తుల విక్రయాలను పెంచుతాం. ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్ జెట్లను కూడా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ట్రంప్ వెల్లడించారు.

అనంతరం మోదీ మాట్లాడుతూ.. "ఇరు దేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం త్వరలోనే జరుగుతుందని విశ్వసిస్తున్నాం. అమెరికాలో చమురు, గ్యాస్ వాణిజ్యంపైనా దృష్టిపెడతాం. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యమే మా లక్ష్యం" అని తెలిపారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలపైనా మోదీ మాట్లాడారు. "యుద్ధం విషయంలో భారత్ది తటస్థ వైఖరి కాదు. మేం శాంతి వైపు నిలబడతాం. ఇది యుద్ధాల శకం కాదని ఇదివరకే రష్యా అధ్యక్షుడు పుతిన్కు చెప్పా. ఉద్రిక్తతలను ఆపడానికి ట్రంప్ తీసుకుంటున్న చర్యలకు మద్దతిస్తున్నా" అని మోదీ వెల్లడించారు.

ట్రంప్ ఎన్నికల ప్రచార సమయంలో 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ ' అనే నినాదాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లారు. దీనినుంచి స్ఫూర్తి పొందుతూ తాను కూడా 'మేక్ ఇండియా గ్రేట్ అగైన్ ' నినాదం ఇస్తున్నట్లు మోదీ ఈసందర్భంగా తెలిపారు. మటగా, మిగా కలిస్తే 'మెగా' భాగస్వామ్యం అవుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. దీన్నే అమెరికా పరిభాషలో చెప్పాలంటే మేక్ ఇండియా గ్రేట్ అగైన్ అని మోదీ పేర్కొన్నారు. ఇలా మగా ప్లస్ మిగా కలిస్తే.. మెగా భాగస్వామ్యం అవుతుందని, ఇది రెండు దేశాల శ్రేయస్సుకు ఉపయోగపడుతుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం ఆయన చెప్పిన ఈ ఈక్వేషన్ ఇరు దేశాల ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రధాని మోదీ మంచి వక్త అనే విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అమెరికా పర్యటనలో కూడా మోదీ ప్రసంగం ఆకట్టుకుంది.

**భారత్-అమెరికా సంబంధాలు:** ఈ క్రమంలో భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. భారత్, అమెరికా సుసంపన్న ప్రజాస్వామ్య దేశాలుగా నిలవాలని, మానవాళి సంక్షేమం కోసం కలిసి పనిచేస్తే, అది ప్రపంచానికి మంచి మార్గదర్శకత్వం అవుతుందని మోదీ అన్నారు.




**ఎలాన్ మస్క్తో చర్చలు:** ఎలాన్ మస్క్తో మోదీ బేటీ. స్పేస్, టెక్నాలజీ, మొబిలిటీ, ఇన్నోవేషన్ వంటి రంగాలలో భారత్ చేసే సంస్కరణలు, గవర్నమెంట్, మాక్సిమమ్ గవర్నెన్స్ వైపుగా చేయగలిగే ప్రయత్నాల గురించి ఎలాన్ మస్క్తో చర్చించానని ప్రధాని మోదీ తెలిపారు.

**అక్రమ వలసదారులపై మోడీ కీలక వ్యాఖ్యలు:** ప్రధాని మోదీ అక్రమ వలసదారులపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. అక్రమ వలసదారులకు దేశంలో ఉండే హక్కు రాదు. ఇది అంతర్జాతీయ సమస్య. ఏ దేశం అయినా తమ హోదాను పాటించాల్సి ఉంటుందని తెలిపారు. అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన భారతీయులను తాము వెనక్కితీసుకుంటామంటూ ప్రకటించారు. అక్రమ వలసలను అరికట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని మోదీ పేర్కొన్నారు. కొంతమంది డబ్బుకోసం ఆశపడి, అమాయక యువతను అక్రమంగా అమెరికాకు పంపిస్తున్నారని, ఈ హ్యూమన్ ట్రాఫికింగ్ను అరికట్టాలని పిలుపునిచ్చారు.

**ప్రతిష్టాత్మక రాయబార కార్యాలయాలు:** అమెరికాలో భారత రాయబార కార్యాలయాలను మరింత విస్తరించడానికి ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. మరిన్ని భారత రాయబార కార్యాలయాల విషయంలో లాస్ఏంజెల్స్, బోస్టన్ నగరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని ప్రధాని ప్రకటించారు.

కాగా ట్రంప్-మోదీ భేటీలో భారత విదేశాంగ మంత్రి జై శంకర్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ కూడా పాల్గొన్నారు.







# 19న ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారం..!

**సీఎం ఎంపికపై సోమవారం భాజపా నేతల భేటీ**



ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా.. ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే సీఎం ప్రమాణస్వీకారం ఫిబ్రవరి 19, 20 తేదీల్లో ఉండనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అమెరికా, ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ భారత్ కు బయలుదేరిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే సోమ, మంగళవారాల్లో భాజపా శాసనసభా పక్ష నేతలు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశం అనంతరం నూతన సీఎం ఎవరనే దానిపై స్పష్టత రానుంది. ఇక, ఎన్నికల్లో గెలిచిన 48 మంది అభ్యర్థుల్లో 15 మందిని పార్టీ షార్ట్లిస్ట్ చేసింది. వీరిలో తొమ్మిది మందిని సీఎం, స్పీకర్, క్యాబినెట్ స్థానాలకు ఎంపిక చేయనుంది. దిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మాజీ సీఎం కేజ్రీవాల్ను ఓడించిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నారు. ఆయనతో పాటు సతీశ్ ఉపాధ్యాయ్, విజయేందర్ గుప్తా, ఆశిష్ సూద్, పవన్ శర్మ వంటి పలువురు నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. పూర్వాంచల్ నేపథ్యం కలిగిన ఎమ్మెల్యే, సిక్కు లేదా మహిళను సైతం పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉండొచ్చని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను భాజపా 48 స్థానాల్లో విజయఢంకా మోగించి తన 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంది. ఆప్ కేవలం 22 స్థానాలకే పరిమితం కాగా.. కాంగ్రెస్ ఖాతా తెరవలేక చతికిలపడిన విషయం తెలిసిందే.

# చంద్రబాబూ.. మీ ప్రభుత్వం కూలిపోతుంది

- బీజేపీని నమ్మితే ఏం జరుగుతుందో ముందు ముందు తెలుస్తుంది
- ఓట్ల జాబితాల నుంచి ఓటింగ్ మెషిన్ల వరకూ అన్నీ అక్రమాలు
- కేజ్రీవాల్, కాంగ్రెస్ కు జరిగిందే రేపు చంద్రబాబుకు జరుగుతుంది
- హెచ్చరించిన శివసేన ( యుబిటి ) పార్టీ నేత ఆదిత్య ఠాక్రే



ముంబై: ఎన్‌డిఏ భాగస్వామ్యపక్షనేతలైన టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు, జెడియు నేత నితీష్ కుమార్ లను ఉద్దేశించి శివసేన (యుబిటి) నేత ఆదిత్య ఠాక్రే చేసిన వ్యాఖ్యలు చర్చయనీయాంశం అయ్యాయి. బీజేపీని నమ్మితే ఏం జరుగుతుందన్నది తమను చూసి తెలుసుకోవాలని ఆదిత్య అన్నారు. బీజేపీ విషయంలో వారిద్దరికీ హెచ్చరిక చేశారు. మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వాన్ని కూలదోసిన వ్యవహారాన్ని ప్రస్తావించిన ఠాక్రే, దాని వెనుక బీజేపీ ఉందన్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. తమ పార్టీకి జరిగిన ద్రోహమే భవిష్యత్లో టిడిపి, జెడియు కు జరిగే అవకాశం ఉందన్న ఆయన, ఈ విషయంలో ఆ పార్టీలు నేతలు చంద్రబాబు, నితీష్ కుమార్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఢిల్లీలో ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్తో సమావేశం కావడానికి ముందు ఆదిత్య మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా మారిపోయిందని, ఓట్ల జాబితాల నుంచి ఓటింగ్ మెషిన్ల వరకూ అన్నీ అక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. " దేశ భవిష్యత్ ప్రమాదంలో ఉంది. అసలు ఈ దేశంలో ఎన్నికల నిష్పక్షపాతంగా జరుగుతున్నాయా.. అన్న సందేహం ఉంది. ఇతర రాజకీయ పార్టీలకు వేసిన ఓట్లు ఏమవుతున్నాయో తెలీడం లేదు. మాకు, కేజ్రీవాల్, కాంగ్రెస్కు జరిగిందే రేపు చంద్రబాబు, నితీష్, ఆర్జెడీ కి కూడా జరగొచ్చు" అని కామెంట్ చేశారు. దేశంలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలన్నింటినీ నాశనం చేసే కుట్రకు బీజేపీ తెరతీసిందని ఆదిత్య ఆరోపించారు. ఇప్పటికే చాలా ప్రాంతీయ పార్టీలను దెబ్బతీశారని దేశం మొత్తం మీద ఏకపార్టీ విధానం తేవాలన్నది బీజేపీ లక్ష్యం అన్నారు. "ఢిల్లీ ప్రజలకు ఎంతో చేసిన కేజ్రీవాల్ ఓడిపోయారు. పదేళ్లపాటు ఢిల్లీని మార్చడానికి ఆయన ఏం చేశాడో అందరికీ తెలుసు. అయినా కేజ్రీవాల్ ఓడిపోయారంటే.. ఢిల్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కీలకమైన పాత్ర పోషించడమే కారణం" అన్నారు. ప్రభుత్వాలు, పార్టీల గురించి పట్టించుకోకుండా దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావలసిన అవసరం ఉందని ఠాక్రే అన్నారు. శివసేన యుబిటి వ్యాఖ్యలపై జేడీయు నేతలు స్పందించారు. తన గురించి శివసేనకు ఆందోళన అక్కర్లేదని ఆ పార్టీ ఎంపీ సంజీవ్ కుమార్ ఝూ అన్నారు. ఈవిఎం లు వచ్చిన తర్వాతనే బిహార్లో దళితులు, బీసీలు ఓట్లు వేయగలుగుతన్నారని అంతకుముందు అంతా బూత్ ల క్యాప్చరింగ్ ఉండేదన్న ఆయన, శివసేన మళ్లీ అలాంటి వ్యవస్థ కావాలని కోరుకుంటుందా అని ప్రశ్నించారు. టీడీపీ నుంచి అయితే దీనిపై స్పందన లేదు. ఇండియా కూటమిలో ఐక్యత లేకపోవడం వల్లే ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి వచ్చిందన్న విశ్లేషణల మధ్య ప్రతిపక్షాలు కలిసుండాలని ఠాక్రే వ్యాఖ్యలు చేయడం ముఖ్యమైన విషయమే.

# ఏఐసీసీలో మార్పులు చేర్పులకు కసరత్తు

- ప్రియాంకకు కీలక పదవి..?
- వరుస ఓటములతో కాంగ్రెస్ శ్రేణులు ఢీలా
- ఢిల్లీలో హ్యాట్రిక్ జీరో స్థానాలతో పార్టీ శ్రేణుల నిరాశ



న్యూఢిల్లీ: వరుస ఓటములతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీ.. ఆత్మపరిశీలన మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఏఐసీసీ నాయకత్వంలో మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి నాయకత్వ మార్పులను ప్రకటించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కసరత్తు చేస్తున్నారు. మార్పుల్లో భాగంగా వాయనాడ్ ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రాకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది లోక్సభ ఎన్నికల్లో 99 సీట్లు సాధించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం.. పూర్వవైభవం దిశగా దూసుకెళ్తున్నామని భావించింది. కానీ ఆ విజయానికి ఇండి కూటమిలో 30కి పైగా పార్టీల బలం తోడైందని గ్రహించలేకపోయింది. ఆ వెంటనే జరిగిన కొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసిన జమ్ము-కాశ్మీర్, జార?ండ్ రాష్ట్రాల్లో విజయం సాధించగా.. ఒంటరిగా పోటీ చేసిన హర్యానాలో చతికిలపడింది. మహారాష్ట్రలో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసినప్పటికీ ప్రత్యర్థి కూటమిని ఎదుర్కోలేకపోయింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఒంటరి పోరుతో కనీసం ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. 2015 నుంచి ఢిల్లీలో జరిగిన వరుస మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతాయే తెరవలేకపోయింది. నిలకడగా పేలవమైన ప్రదర్శన చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు అవసరమని అగ్రనేతలు భావిస్తున్నారు. మరికొన్ని మాసాల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది(2026) అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసేందుకు ఏఐసీసీలో కీలక మార్పులు, చేర్పుల అత్యవసరం కావడంతో ఆ దిశగా కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే మధ్య అనేక రౌండ్ల సమావేశాలు జరిగాయి. కొన్ని సమావేశాల్లో ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారు.

**వేణుగోపాల్ బాధ్యతల వికేంద్రీకరణ**

కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో "ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (AICC)" అధ్యక్షుడి తర్వాత అత్యంత శక్తివంతమైన పదవి ఏదైనా ఉందంటే అది సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి పదవే. ప్రస్తుతం కేసీ వేణుగోపాల్ ఆ బాధ్యతలు నెరవేర్చుతున్నారు. అలాగే పొలిటికల్ అఫైర్స్ కమిటీ కి కూడా చైర్మన్గా ఉన్నారు. ఈ రెండింటిలో ఒక బాధ్యతను మరొకరికి అప్పగించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. అయితే, కేరళ కాంగ్రెస్ ఎన్నికల బాధ్యతలు చేపట్టే వరకు ఆయన తన పదవిలో కొనసాగవచ్చని తెలిసింది.

**తెలంగాణ ఇంఛార్జ్ మార్పు..?**

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పదవుల్లోకి మరో నలుగురు లేదా ఐదుగురిని కొత్తగా తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ప్రధాన కార్యదర్శులుగా ఉన్నవారిలో కొందరిని తొలగించే అవకాశం కూడా లేకపోలేదు. వారి పనితీరు ఆధారంగా ఈ మార్పులు, చేర్పులు ఉంటాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు వివిధ రాష్ట్రాలకు ఇంచార్జులుగా వ్యవహరిస్తుంటారన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణతో పాటు బిహార్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, అస్సాం రాష్ట్రాల ఇంచార్జుల మార్పులు కూడా ఉంటాయని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే మరో 8 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను కూడా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. అధ్యక్ష మార్పు జరిగే రాష్ట్రాల్లో ఒడిశా, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు తదితర రాష్ట్రాలున్నాయి. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ను అస్సాంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించనున్నట్టు తెలిసింది. కర్ణాటకలో కూడా డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. వీటిలో పార్టీ అధ్యక్ష బాధ్యతల్ని మరొకరికి అప్పగించవచ్చు. జార?ండ్ ఇన్చార్జ్ గులాం అహ్మద్ మీర్ను ఆయన సొంత రాష్ట్రం జమ్మూ కాశ్మీర్కు పంపించే అవకాశాలున్నాయి.

**ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా గిడుగు రుద్రరాజు?**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వైఎస్ షర్మిల కంటే ముందు పనిచేసిన గిడుగు రుద్రరాజును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా తీసుకునే అవకాశం ఉంది. ఆయన ఇది వరకు ఏఐసీసీ కార్యదర్శిగా ఒడిశా రాష్ట్ర కో-ఇంచార్జి బాధ్యతల్ని నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగంలో ఉన్న రుద్రరాజును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా తీసుకుని ఏదో ఒక రాష్ట్ర బాధ్యతల్ని అప్పగిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ప్రియాంక గాంధీ వాద్రాకు కీలక పదవి?**

అలాగే వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్నారు. గతంలో ఉత్తర్ ప్రదేశ్ ఇంచార్జిగా వ్యవహరించిన ఆమెకు ప్రస్తుతం ఏ బాధ్యతలూ లేవు. ఈ పరిస్థితుల్లో ప్రియాంకకు మార్పులు, చేర్పుల్లో భాగంగా కీలక బాధ్యతలు అప్పగిస్తారని విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏదైనా ఒక రాష్ట్ర ఇంచార్జిగా లేదా ఎన్నికల నిర్వహణ / ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్టు పార్టీ నేతలు ఊహిస్తున్నారు. అటు పార్టీ హైకమాండ్కు సన్నిహితులుగా భావిస్తున్న బీకే హరిప్రసాద్, సచిన్ రావు, మీనాక్షి నటరాజన్, బీవీ శ్రీనివాస్, పర్గత్ సింగ్, అజయ్ కుమార్ లల్లు, హరీష్ చౌదరి, జిగ్నేష్ మేవాని, కృష్ణ అలవారు, మహ్మద్ జావేద్, అభిషేక్ దత్, ప్రకాష్ జోషి, గణేష్ గొడియాల్ వంటి అనేక మంది నాయకులకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించవచ్చని తెలుస్తోంది. అలాగే రణదీప్ సింగ్ సుర్జేవాలా, భూపేశ్ భగేల్, టీఎస్ సింగ్ దేవ్, భన్వర్ జితేంద్ర సింగ్ లేదా అశోక్ గెహ్లాట్ కూడా పార్టీలో కొత్త బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. ఏఐసీసీ కమ్యూనికేషన్స్ విభాగం సెక్రటరీ జనరల్ జైరామ్ రమేష్ స్థానంలో మరొకరిని నియమించాలని కూడా పార్టీ భావిస్తోంది. అయితే సీనియారిటీ పరంగా ఆయనకు మరో ప్రత్యామ్నాయాన్ని హైకమాండ్ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దీంతో మరికొన్నాళ్లు ఆయన్ను ఈ బాధ్యతల్లో కొనసాగించవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# అదాని వ్యవహారం వ్యక్తిగతం

**అమెరికా అధ్యక్షుడితో ఆవిషయం చర్చకు రాలేదు**

**తనదైన శైలిలో సమాధానం ఇచ్చిన భారత ప్రధాని మోడీ**

**అదానీ అవినీతిని మోడీజీ కప్పిపుచ్చుతున్నారంటూ రాహుల్ మండిపాటు**



వాషింగ్టన్: భారత్‌కు చెందిన కార్పొరేట్ దిగ్గజం అదానీ గ్రూప్పై అమెరికాలో పెట్టిన కేసు మోదీ-ట్రంప్ భేటీ సందర్భంగా చర్చకు వచ్చిందా..? అన్నది ఆసక్తికరంగా మారింది. విలేకర్ల సమావేశం సందర్భంగా ఈ ప్రశ్న ప్రధాని మోదీకి ఎదురైంది. దానికి ఆయన తనదైనశైలిలో స్పందిస్తూ వ్యక్తిగత స్థాయి అంశాలు చర్చించరని పేర్కొన్నారు. "భారత్ ఓ ప్రజాస్వామ్య దేశం. వసుదైక కుటుంబం అనేది మా సంస్కృతి. ప్రపంచం మొత్తం మా కుటుంబం అనుకొంటాము. ప్రతి భారతీయుడిని మావాడిగానే భావిస్తాం. ఇద్దరు దేశాధినేతలు ఎప్పుడూ వ్యక్తిగత స్థాయి అంశాలను చర్చించరు" అని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు అదానీపై జోబైడెన్ కార్యవర్గ వైఖరిని తప్పుపడుతూ ఆరుగురు అమెరికా చట్టసభ సభ్యులు అటార్నీ జనరల్ పామ్ బోండికి లేఖలు రాశారు. అదానీ విషయంలో అమెరికాలో ప్రధాని మోదీ జవాబుపై ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ మండిపడ్డారు. ప్రధాని తన స్నేహితుడిని కాపాడుకొంటున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆయన ఎక్స్లో ఓ పోస్టు చేశారు. "దేశంలో ప్రశ్నలు అడిగితే మౌనం.. విదేశాల్లో అడిగితేనేమో అది వ్యక్తిగత విషయం. అమెరికాలో మోదీజీ అదానీ అవినీతిని కప్పిపుచ్చుతున్నారు. మిత్రుడి జేబు నింపడం మోదీకి జాతి నిర్మాణం అవుతుంది. అప్పుడు లంచాలు ఇవ్వడం, జాతి సంపదను దోచుకోవడం 'వ్యక్తిగత అంశాలు'గా మారిపోతాయి" అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని పొందేలా అధిక ధరకు సౌర విద్యుత్తు కొనుగోలు చేసేలా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 'ఉన్నత స్థాయి' వర్గాలకు లంచాలు ఇచ్చినట్లు ఎఫ్సీపీఏ కింద పలువురిపై అమెరికాలో కేసులు నమోదు చేశారు. ఆ నిధులను అమెరికాలో పెట్టుబడి కింద అదానీ గ్రూప్ సమీకరించడమే అక్కడ కేసు నమోదుకు కారణం. సౌర విద్యుత్ విక్రయ కాంట్రాక్టుల్లో అనుకూల షరతులు అమలుచేసేందుకు అదానీ గ్రూప్ 250 మిలియన్ డాలర్ల (రూ.2029 కోట్లు) మేర లంచాలు ఇచ్చారన్నది ఆరోపణ. అదానీపై దర్యాప్తు చేపట్టాలంటూ అమెరికా అధ్యక్షుడిగా అప్పుడు ఉన్న జోబైడెన్ నేతృత్వంలోని న్యాయశాఖ ఆదేశాలు జారీ చేయడంతో అదానీ గ్రూప్ ఛైర్మన్తో పాటు పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఈ లంచాలను చెల్లించడానికి, ప్రాజెక్టు నిధుల నిమిత్తం తప్పుడు సమాచారం ఇచ్చి అమెరికా బ్యాంకులు, పెట్టుబడిదార్ల నుంచి అదానీ గ్రూప్ భారీ మొత్తంలో నిధులు సమీకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే తమపై నమోదైన ఆరోపణలన్నిటినీ అదానీ గ్రూప్ కొట్టిపారేస్తూ వచ్చింది.

# గుడిలో భక్తులను తొక్కి చంపిన ఏనుగులు..

- కేరళలో భయానక ఘటన
- మేనక్కులంగర భగవతి ఆలయ వార్షిక ఉత్సవం
- బాణసంచా పేల్చడంతో బెదిరిన రెండు ఏనుగులు
- ఘటనలో 24 మంది తీవ్రంగా గాయాల పాలు.

తిరువనంతపురం: కేరళలో విషాదకరమైన ఘటన జరిగింది. దేవాలయంలో ఉత్సవాల సందర్భంగా పటాకుల శబ్దానికి బెదిరిపోయిన ఏనుగులు భక్తులపై దాడి చేసి, వారిని తొక్కి చంపినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు భక్తులు మరణించగా, 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల సమాచారం ప్రకారం.. కేరళలోని కోజికోడ్ జిల్లాలోని కోయిలాండి సమీపంలోని కురవంగడ్లోని మనక్కులంగర భగవతి ఆలయ ప్రాంగణంలో వార్షిక ఉత్సవం జరిగింది. ఉత్సవం చివరి రోజున నిర్వాహకులు రెండు ఏనుగులను తీసుకువచ్చారు. ఉత్సవ సమయంలో నిర్వాహకులు బాణసంచా పేల్చారు. దీంతో ఆ రెండు ఏనుగులు బెదిరిపోయాయి.

ఆ తరువాత రెండు ఏనుగులు ఒకదానితో మరొకటి తలపడ్డాయి. ఈ క్రమంలో అక్కడ ఉన్న భక్తులపై దాడి చేస్తూ.. వారిని తొక్కుకుంటూ ఆ ప్రాంతం నుంచి పరుగులు తీశాయి. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు మరణించగా, 24 మంది తీవ్రంగా గాయపడ్డారు.

"ఈ దుర్ఘటన గురువారం, ఫిబ్రవరి 13, 2025 సాయంత్రం 6 గంటల సమయంలో జరిగింది. ఏనుగులను సాయంత్రం ఊరేగింపు కోసం ప్రదర్శిస్తుండగా, పటాకుల శబ్దం విన్న తర్వాత అకస్మాత్తుగా వాటిలో ఒక ఏనుగు బెదిరిపోయింది. మరో ఏనుగుతో ఘర్షణకు దిగింది. ఆ సమయంలో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఏనుగులు ఒకదానికొకటి తోసుకోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యాలయం కూడా కూలిపోయింది" అని కౌన్సిలర్ చెప్పారు. దేవాలయంలో జరిగిన ఈ దుర్ఘటనపై సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది రెండు ఏనుగులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, క్రాకర్ల శబ్దానికి ఏనుగులు బెదిరిపోవడం వల్లే ఈ విషాదం జరిగిందని ప్రాథమికంగా తేల్చారు.

కోయిలాండి ఎమ్మెల్యే కనాతిల్ జమీలా మీడియాతో మాట్లాడుతూ.. "ఏనుగులు టపాసుల శబ్దానికి బెదిరిపోయాయి. అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాయి. ఆ సమయంలో భక్తుల మధ్య తొక్కిసలాట, తోపులాట జరిగింది. గాయపడిన 24 మందిని ఆసుపత్రికి తరలించాము" అని తెలిపారు.



వారం రోజుల క్రితమే ఇలాంటిదే మరో ఘటన జరిగింది. కేరళలోని త్రిస్సూరు జిల్లా పైంగన్నిక్కల్ దేవాలయ ఉత్సవాల కోసం ఒక ఏనుగుని స్నానం చేయిస్తూ ఉండగా.. అది మదమెక్కి చుట్టుపక్కల ఉన్నవారందరిపైనా దాడి చేసింది. ఈ ఘటనలో దాని మహావటుతో పాటు ఇద్దరికీ తీవ్ర గాయాలకు కాగా.. ఆనంద్ అనే 38 ఏళ్ల యువకుడిని ఏనుగు తొక్కి చంపేసింది. ఆ తరువాత ఏనుగుని కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించగా.. అది సమారు 8 కిలోమీటర్ల వరకు పరుగులు తీసింది. ఏనుగుని నియంత్రించేందుకు పోలీసులు, ఎలిఫెంట్ స్క్వాడ్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏనుగు ఈ క్రమంలో వరి పొలాన్ని నాశనం చేసింది. గాయపడిన ఇద్దరినీ చావక్కాడ్ తాలుకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏనుగుల చేత ఇలా దేవాలయ ఉత్సవాల్లో ఊరిగింపు చేయకూడదని గతంలో కేరళ హై కోర్టు నిషేధం విధించింది. కానీ హై కోర్టు తీర్పుని సవాల్ చేస్తూ.. కేరళకు చెందిన తిరువంబాడి, పారమెక్కవు దేవస్థానాలు సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయగా.. జస్టిస్ బివి నాగరత్న, ఎన్కె సింగ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం హై కోర్టు తీర్పుపై డిసెంబర్ 2024లో స్టే విధించింది.



# బీసీ విద్యార్థుల డైట్ బకాయిలు చెల్లించండి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతో స్పష్టమైన మార్పులు రావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబు దారీతనం కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్ష చేశారు. రాష్ట్రంలోని 660 గవర్నమెంట్ హాస్టల్స్లో రూ.13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో ఆరు వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గత ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కిచెన్ ఐటెమ్స్ అందించలేదని, రూ.18 కోట్లతో వాటి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించగా, ఈ ప్రక్రియ కూడా మార్చి మూడవ వారం నాటికి పూర్తవ్వాలన్నారు.

బకాయిల విడుదలకు గ్రీన్ సిగ్నల్

పెండింగ్ ట్యూటర్స్ హానరోరియంకు సంబంధించి 485 హాస్టళ్లలో 2024 మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన రూ.2.02 కోట్ల బకాయిలు, ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సి ఉన్న రూ.2.33 కోట్ల బకాయిలు మొత్తం కలిపి రూ.4.35 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, వెంటనే చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు. డైట్ ఛార్జెస్కు సంబంధించి రూ.185.27 కోట్లు పెండింగులో ఉన్నాయని అధికారులు వివరించగా ప్రస్తుతం రూ.110.52 కోట్ల చెల్లింపునకు సీఎం అంగీకారం తెలిపారు. అదే విధంగా కాస్మోటిక్ బిల్లులు రూ.29 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. అలాగే హాస్టళ్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని సూచించారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బీసీ గర్ల్స్ కాలేజీలుగా అప్గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేబినెట్లో కూడా ఆమోదం తెలిపామని, ఈ మేరకు అవసరమైతే న్యాయపోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రతి కార్పొరేషన్కు దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధివిధానాలు రూపొందించామని తెలిపారు.

# నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాలి

- స్థల సేకరణ.. అనుమతులపై సీనియర్ అధికారులు దృష్టి సారించాలి
- కలెక్టర్లు క్షేత్ర స్థాయి పరిశీలనలు చేపట్టాలి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఐసీసీసీలో విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. కొడంగల్, మధిర, హుజూర్ నగర్ ల్లోని స్కూళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, మార్చి 20వ తేదీన పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. మిగతా నియోజకవర్గాల్లో భూ సేకరణ, అనుమతుల ప్రక్రియను ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన సీనియర్ అధికారులు చూడాలని సీఎం ఆదేశించారు. నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు అనువుగా ఉండే ప్రదేశాన్ని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి ఎంచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటన చేసి స్థలాల ఎంపికలో జాగ్రత్త వహించాలని సీఎం అన్నారు. భూ సేకరణ, స్థలాల ఎంపిక ప్రతి రెండు రోజులకోకసారి సమీక్షించాలని, పది రోజుల్లోపే దీనిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సీఎం ఆదేశించారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతి పదికన పనులు మొదలు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

నిర్మాణాలు యూనివర్సిటీ స్థాయిలో ఉండాలి

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర అవసరాల కోసం చేపట్టే నిర్మాణాలు యూనివర్సిటీల స్థాయిలోనే ఉండాలని... ఈ విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గదులు, ల్యాబ్లు, ప్లేగ్రౌండ్, ఇతర నిర్మాణాలు చేపట్టాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ నిర్మాణాలకు సంబంధించి నిధుల వ్యయానికి ప్రభుత్వం వెనుకాడదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని చారిత్రక, పురాతన కట్టడాలను పరిరక్షించాలని, వాటికి అవసరమైన మరమ్మతుల విషయంలో పురావస్తు శాఖ అధికారులతో చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. నిర్మాణ ఆకృతులకు సంబంధించి పలు మార్పులను ముఖ్యమంత్రి సూచించారు. సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.గౌతమి, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ నరసింహారెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పళని టూ తిరుపతికి రైలు సర్వీసుపై

# కేంద్రంతో చర్చిస్తా..

పళని దండాయుధ పాణి స్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



తమిళనాడు:దేశంతో పాటు ప్రజల శ్రేయస్సుకు తమిళనాడు పళని దండాయుధ పాణి స్వామిని ప్రార్థించానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పళని నుండి తిరుపతికి రోజువారీ రైలు సర్వీసు కోసం ప్రజలు చేసిన అభ్యర్థనపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని.. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రవాణా సంస్థ అధికారులతో చర్చించిన తర్వాత పళని–తిరుపతి బస్సు సర్వీసును పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ చెప్పారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమిళనాడులోని ముఖ్యమైన దేవాలయాల ఆధ్యాత్మిక పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా మధురైలోని తిరుపరంకుండ్రం కుమార స్వామిని దర్శించుకున్నాక..శుక్రవారం పళని కొండపై వెలసిన వేలాయుధ స్వామి ఆలయాన్ని సందర్శించారు.

రోప్వే ద్వారా కొండ ఆలయానికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్, ఆయన కుమారుడు అకిరా నందన్ ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు పవన్ కళ్యాణ్కు ఆలయ ప్రసాదాలు అందజేశారు.

ఆనందాన్నిచ్చిన ఆధ్యాత్మిక ప్రయాణం: ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ విలేకరులతో మాట్లాడుతూ, తమిళనాడులో నేను చేపట్టిన ఆధ్యాత్మిక ప్రయాణం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. దేశం, ప్రజలు బాగుండాలని నేను ఎల్లప్పుడూ దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఇంకా పళని నుండి తిరుపతి ఆలయానికి ప్రతిరోజూ బస్సు నడపబడుతుందని, రైలు సర్వీసు కోసం కేంద్రం మాట్లాడతాం.. అని అన్నారు.

# గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు..

- రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ లెక్క చేస్తున్నారు
- రాత్రికి రాత్రి పనులు చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కుట్ర
- మాజీ మంత్రి హరీశ్ రావు



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి ఫైర్ అయ్యారు. గుమ్మడిదలను మరో లగచర్ల చేయవద్దని అన్నారు. శుక్రవారం గుమ్మడిదలలో జీహెచ్ఎంసీ డంప్యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా స్థానికులు చేస్తున్న ఆందోళనకు మాజీ మంత్రి మద్దతు తెలువుతూ.. సంఘీభావంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు తెచ్చి మా నెత్తిన వేయకండి అంటే మొండిగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. పర్యావరణం దెబ్బతింటదని, నర్సాపూర్ చెరువు కలుషితం అవుతుందని.. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయనే వద్దు అంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు గతంలోనే ఈ పనులను ఆపామని చెప్పుకొచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వెళ్తోందన్నారు. రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ లెక్క చేస్తున్నారని విమర్శించారు. వందల మందిని ఎత్తుకొని పోయి పోలీసు స్టేషన్లలో పెడుతున్నారని.. రాతకి రాత పనులు చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి దుర్మార్గంగా ప్రవర్తించడం సరికాదన్నారు. గుమ్మడిదల రైతులు అందరికీ ఆదర్శమని.. బంగారం వంటి పంటలు పండిస్తారని తెలిపారు. తక్షణమే డంపు యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వచ్చాక లగచర్ల భూములు గుంజుకున్నారని..న్యాల్కల్లో పచ్చటి పొలాలు గుంజుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గుమ్మడిదలను మరో లగచర్ల చేయకండని రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యం అన్నారని.. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఊళ్లలో మంది ఎంత మంది ఉంటే అంత మంది పోలీసులను పెట్టారని.. ఓట్లేసిన పాపానికి ప్రజలను మోసం చేశారంటూ మండిపడ్డారు. రుణమాఫీ, రైతు బంధు, మహాలక్ష్మి, ఇలా అన్నీ మోసమే అని అన్నారు. గుమ్మడిదల రైతుల కోరిక మేరకు డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పకుండా అసెంబ్లీ వేదికగా గుమ్మడిదల ప్రజల తరవున పోరాటం చేస్తామని... ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామన్నారు. ఎయిర్ ఫోర్స్ వాళ్లు కూడా ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కలెక్టర్కు ఫిర్యాదు చేశారని.. అయినా పట్టించుకోవడం లేదన్నారు. టిప్పర్లు, పోలీసులను వెనక్కి తీసుకోవాలని.. ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కళ్లు తెరవకుంటే తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. చేతిలో అధికారం ఉందని బలవంతంగా పని చేయవద్దన్నారు. రెండు సార్లు హైకోర్టు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పనులు ఆపాలని, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్లను హెచ్చరిస్తున్నామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# తులసిబాబుకు ఏపీ హైకోర్టులో చుక్కెదురు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగం కేసులో కామేపల్లి తులసిబాబుకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తులిసిబాబు బెయిల్ పిటిషన్ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ కేసులో కీలక నిందితులు అరెస్ట్ కావాల్సి ఉండటంతో బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఇరవై రోజుల క్రితం తులసిబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే జిల్లా కోర్టులో కాకుండా హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు తులసిబాబు.

ఈరోజు ఈ పిటిషన్పై హైకోర్టులో విచారణకు రాగా.. ఈ కేసులో కీలక నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు అభిప్రాయపడింది. మరికొంతమంది కీలక నిందితులు కూడా అరెస్ట్ కావాల్సి ఉంది. ఇందులో అప్పటి ఇంటలిజెన్స్ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్ కుమార్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన విజయ్ పాల్కు మాత్రం జిల్లా కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అంతకు ముందు విజయ్ పాల్కు కూడా జిల్లా కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా బెయిల్ పిటిషన్ను డిస్మిస్ చేసింది. ఆయన మరలా జిల్లా కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ వేయగా.. దాదాపు రెండు నెలల తర్వాత విజయ్ పాల్కు బెయిల్ మంజూరు అయ్యింది.

ప్రస్తుతం కీలక నిందితుడిగా ఉన్న తులసిబాబును కూడా ఒంగోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఒంగోలు ఎస్పీ ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిపారు. ఈ విచారణలో ఆయన ఎటువంటి సహకారం అందించలేదని, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని పోలీసులు పిటిషన్ ఫైల్ చేశారు. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా తులసిబాబును ఒంగోలు ఎస్పీ విచారించారు. అయినప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, దర్యాప్తుకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్ ఫైల్ చేశారు. నాలుగు రోజుల క్రితమే తులసిబాబు బెయిల్ పిటిషన్పై వాదప్రతివాదనలు ముగియగా.. ఈరోజు తులసిబాబు బెయిల్ పిటిషన్ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ

# మారే పరిస్థితి ఉండదు



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: పార్టీ మారిన వారి పరిస్థితి చూస్తున్నాం అని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారే పరిస్థితి ఉండదు అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ క్యాడర్ చాలా హుషారుగా ఉందని, ఎవరు వార్త రాపించారో వాళ్లనే అడగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా సర్వే చేసిందని, హైదరాబాద్ గ్రామాల్లో సర్వే ప్రాపర్గా జరుగలేదన్నారు. 60 లక్షల మంది ఎక్కడ పోయారో లెక్కలు లేవని తలసాని విమర్శించారు. ముందు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవండని, తమ మీద పడి ఏడవడం ఏంటి? అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్లో తలసాని శ్రీనివాస్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మా ఎమ్మెల్యేలు పార్టీ మారే పరిస్థితి ఉండద. పార్టీ మారిన వారి పరిస్థితి మేం చూస్తున్నాం. అప్పటి పరిస్థితులను బట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారారు. ఎవరు వార్త రాపించారో వారినే అడగాలి. మరలా మొత్తం సర్వే చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. కుట్ర పూరితంగా సర్వే చేశారు. హైదరాబాద్ గ్రామాల్లో సర్వే ప్రాపర్గా జరుగలేదు. 60 లక్షల మంది ఎక్కడ పోయారో లెక్కలు లేవు అని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన లెక్కలు చూస్తే కూడా.. మిగితా వాళ్ళు ఎక్కడకి పోయారు అనేది క్లారిటీ లేదు. బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలి. తీర్మానం చేసి కేంద్రానికి పంపితే లాభం లేదు. జనాభా ప్రాతిపదికన ఫైనాన్స్ కమిషన్ నుంచి కేంద్రం డబ్బులు ఇస్తుంది. 1.35 శాతం జనాభా పెరుగుదల ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవండి, మా మీద పడి ఏడవడం ఏంటి? అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

# రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలుపై అవగాహన కల్పించాలి


- ప్రజల రవాణా పరమైన సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి
- నాన్ ఆఫీసియల్ సభ్యుల సమావేశంలో మంత్రి పొన్నం



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: నూతనంగా నియమితులైన (నాన్ ఆఫీసియల్) సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా నియమైకమైన వారితో సమాచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 24 మందికి సభ్యులుగా అధికారిక నియామక పత్రాలు వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. జిల్లాల్లో స్థానిక నాయకత్వం సలహా సూచనల మేరకు నేరుగా మీ వద్దకే నియామక పత్రాలు వచ్చాయని సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్తగా నియామకైమైన సభ్యులు రవాణా శాఖ గౌరవాన్ని అభివృద్ధిని ప్రజల సౌకర్యార్థం రవాణా సేవల్లో వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రవాణా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమాలు తదితర అంశాలను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ వివరించారు. రవాణా శాఖ విధులు మోటారు వాహనాల చట్టం రిజిస్ట్రేషన్ ,పన్ను వసూలు , లైసెన్స్ ,ఫిట్నెస్ , తనిఖీలు ,రోడ్ సేఫ్టీ ,పొల్యూషన్ కంట్రోల్ , మీ సేవా యాప్ (టి యాప్ ) ,ఆర్టీఏ ఎం వాలెట్ , నవంబర్ 16 నుండి అమలు చేస్తున్న ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ ,వెహికిల్ స్క్రాప్ పాలసీ , నుండి గా మార్పు ,ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ , వాహనాల ట్రాకింగ్ పరికరాలు , ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ , తెలంగాణ ఏర్పడిన తరువాత మొదటిసారి రవాణా శాఖకు లోగో ఏర్పాటు ,రోడ్డు భద్రత రవాణా శాఖ మొదటి ప్రాధానత్య తదితర అంశాలను నాన్ అఫిసియో సభ్యులకు వివరించారు. గతంలో రోడ్ సేఫ్టీ వీక్ ఉండేదని దానిని నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలులో భాగంగా నెల రోజుల పాటు ప్రతి జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారి యూనిసెఫ్ సహకారంతో నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో గవర్నర్ చేతుల మీదుగా చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ప్రారంభించారు. రోడ్డు సేఫ్టీ మీద మీ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ ఛైర్మన్ గా ,రవాణా శాఖ అధికారి సభ్య కార్యదర్శి గా మెంబెర్స్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు నిత్యం ప్రజలతో మమేకమవుతూ రోడ్డు భద్రత లో భాగంగా ప్రయాణికుల ప్రయోజనం చేకూర్చడానికి ప్రమాదాలు తగ్గించడానికి రోడ్డు భద్రత చొరవలు ప్రజా రవాణా సేవలను మెరుగుపరచడం కోసం పని చేయాలి. పర్యావరణ అనుకూల రవాణా ప్రోత్సహించడం సుస్థిర రవాణా పద్ధతులు పర్యావరణ సమస్యల పై తమ అభిప్రాయాలు తెలియజేస్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఏదైనా బాధ్యత వచ్చినప్పుడు ప్రజలు జ్ఞాపకం ఉంచుకునేలా పని చేయాలని సూచించారు. రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ అవేర్నెస్ పార్క్ లు ఏర్పాటు చేయాలని సూచించారు.

# బిఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులకు వింత జబ్బు

బీఆర్ఎస్పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన కడియం



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. స్టేషన్ ఘనపూర్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం బీఆర్ఎస్ నాయకులు,శ్రేణులపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. అధికారం లేకపోవడంతో బిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి, పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. పదవి, అధికారం లేకుండా ప్రజలకు సేవ చేసే అలవాటు బిఆర్ఎస్ శ్రేణులకు లేదు అని మండిపడ్డారు. పత్రికా సమావేశాలు పెట్టి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడమే ప్రతిపక్షాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన బిఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలి. బిఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులకు వింత జబ్బు సోకిందనే అనుమానం కలుగుతోంది. వింత జబ్బు ఎక్కువగా కేటీఆర్, కవితలకే ఉన్నది అని కడియం తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు మాట్లాడని కవిత ఇప్పుడు బీసీల రిజర్వేషన్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని కడియం ఎద్దేవ చేశారు. 4 సంవత్సరల తర్వాతే సాధారణ ఎన్నికలు వస్తాయి. మళ్లీ అధికారంలోకి ఎవరు రావాలనేది అప్పుడు ప్రజలు నిర్ణయిస్తారని తెలిపారు.

# వంశీని వెంటాడిన ఖర్మ సిద్ధాంతం

- ఆకాశం నుంచి అధః పాతాళానికి ప్రజలకు సేవలందించినా, నోటు దురుసుతో దూరమైన నేత
- రెండుసార్లు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపు
- పార్టీకే ఎదురుతిరిగిన నేత
- సీఎం కుటుంబంపై చేసిన వ్యక్తిగత విమర్శలే శాపంగా మారాయి
- సొంత సామాజికవర్గంలోనూ వ్యతిరేకత
- సక్సెస్ఫుల్ రాజకీయ జీవితానికి సమాధి
- పలు కేసుల్లో నిందితుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వల్లభనేని వంశీ...గన్నవరం నియోజకవర్గంలో తిరుగులేని నేత. ఏ గ్రామంలో పర్యటించినా, అక్కడి ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించిన నేత. ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడని నేత. ఇంటి వద్ద ఎప్పుడు వందలాది మంది కార్యకర్తలకు భోజనాలు..కాఫీ, టిఫెన్లు. వచ్చినవారెవరూ భోజనం చేయకుండా వెళ్లని పరిస్థితి. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించిన రోజులు లేకపోలేదు. సాగునీటి ఎద్దడి వస్తే రైతులకు సొంత ఖర్చుతో నీటి మోటార్లు కొనుగోలు చేసి ఇచ్చిన చరిత్ర కూడా లేకపోలేదు. అంతటి చరిత్ర కలిగిన వంశీ అనూహ్యంగా అధ:పాతాళానికి దిగజారిపోయారు. చిక్కుల్లో పడిపోయారు. అనేక కేసుల్లో నిందితులయ్యారు. పోలీసుల నుంచి తప్పించుకోడానికి రాష్ట్రం దాటి వెళ్లాల్సిన దుస్థితి ఆయన ఎదుర్కొన్నారు.

టీడీపీలో రాజకీయ జీవితం ప్రారంభించి.. ఆ పార్టీపైనే తిరుగుబాటు చేసి.. పార్టీ అధినేత కుటుంబంపై నోరుజారి చిక్కుల్లో పడ్డారు. గన్నవరం నుంచి టీడీపీ తరవున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వంశీ.. అదే పార్టీకి టార్గెట్ అయ్యారు. దూకుడు రాజకీయంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న వంశీ.. అదే దూకుడుతో తన రాజకీయ భవితవ్యానికి ఆటంకాలు ఏర్పరుచుకున్నారు. పదిహేనేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసినా, తాజాగా ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితిని ఎవరూ సమర్థించలేకపోతున్నారు. సొంత పార్టీ వైసీపీ వంశీ అరెస్టును ఖండిస్తున్నా..పూర్తి స్థాయిలో సహకరించే పరిస్థితులు కనపడటం లేదు.

సినీ నిర్మాతగా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చిన వల్లభనేని వంశీ.. టీడీపీ సీనియర్ నేత పరిటాల రవీంద్ర అనుచరుడిగా ఆ పార్టీకి దగ్గరయ్యారు. జూనియర్ ఎన్టీఆర్తో సినిమాలు తీసి ఆయనకు దగ్గరయ్యారు.. టీడీపీలో ఓ స్థాయి నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2009లో తొలిసారి టీడీపీ టికెట్పై విజయవాడ పార్లమెంటుకు పోటీ చేసిన వంశీ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరగడం, 2014 ఎన్నికల్లో కేశినేని నానికి ఎంపీ టికెట్ ఇవ్వడంతో వంశీకి గన్నవరం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. జూనియర్ ఎన్టీఆర్తో సంబంధాలు, ఓడినా పార్టీ కోసం పనిచేయడం, దివంగత నేత పరిటాల రవీంద్ర అనుచరుడనే గుర్తింపు కలిసిరావడంతో టీడీపీకి పట్టున్న గన్నవరం టికెట్ దక్కింది.

గన్నవరంలో టీడీపీకి ఓడిన చరిత్ర లేదు..

గన్నవరంలో ఇప్పటివరకు టీడీపీ ఓడిన చరిత్ర లేదు. రెండు సార్లు ఇండిపెండెంట్లు గెలిచినా, ఆ ఇద్దరూ టీడీపీ నేతలే కావడం గమనార్హం. అలాంటి సీటులో రెండు సార్లు పార్టీ అవకాశమిస్తే.. 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత వంశీ అప్పటి అధికార పార్టీ వైసీపీకి దగ్గరయ్యారు. 2014లో ఎమ్మెల్యే అయిన తర్వాత 2019 ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత జగన్ పాదయాత్రకు ఎదురెళ్లి ఆయనతో కరచాలనం చేసినా అప్పట్లో టీడీపీ పెద్దగా పట్టించుకోలేదు. వంశీపై నమ్మకంతో 2019లో టికెట్ ఇచ్చి గెలిపించారు. టికెట్ ఇవ్వడమే కాకుండా ఆర్థికంగా భారీ సాయం చేశారని కూడా ఆ పార్టీలో టాక్. అయితే ఎన్నికల్లో గెలిచాక వైసీపీకి దగ్గరైన వంశీ.. మిగిలిన ఎమ్మెల్యేల్లా కాకుండా.. పరిధి దాటి వ్యవహరించారనే విమర్శలు ఎదుర్కొన్నారు.

ఉరితాడుగా మారిన వ్యక్తిగత విమర్శలు

ప్రస్తుత ముఖ్యమంతి చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేశ్, చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వంశీ వ్యక్తిగత దూషణలకు దిగి ముప్పు తెచ్చుకున్నాడనే అభిప్రాయం ఉంది. అసెంబ్లీలో వంశీ నోరు జారడంతోనే చంద్రబాబు కన్నీరు పెట్టుకోవడం, కౌరవ సభ నుంచి వాకౌట్ చేస్తున్నానని, మళ్లీ గెలిచి సీఎంగా గౌరవ సభలోనే అడుగు పెడతానని ప్రతినబూనారు. అట్లా వంశీ నోరు జారిన ఒక్క మాటే ఆయనకు, ఆయన మద్దతు పలికిన పార్టీకి తీరని నష్టం చేసింది. 151 ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని నడిపిన వైసీపీ.. ప్రతిపక్ష హోదాకు కూడా అర్హత సాధించలేకపోయింది. ఇక వ్యక్తిగతంగా తాను ఎంతటి తప్పు చేశానో తెలుసుకున్న వంశీ నష్టనివారణ ప్రయత్నాలు చేసినా అవేవీ ఫలించలేదు. అప్పటికే ఆయన మాటలు టీడీపీ క్యాడర్ను తీవ్రంగా బాధించడంతో సంబంధం లేనివారు కూడా వైసీపీ పతనాన్ని కోరుకునేలా చేసిందనే విశ్లేషణలున్నాయి. తాజాగా ఆయన అరెస్టు తర్వాత కృష్ణలంక పోలీసు స్టేషన్ ఎదుట మాట్లాడిన వంశీ భార్య కూడా తప్పు అయిపోయిందనే భావాన్ని వ్యక్తం చేయడం.. తప్పు అంతా చేస్తారని, తమకు న్యాయం చేయాలని వేడుకోవడం చూస్తుంటే వంశీ మాటల ద్వారా ఎంత నష్టపోయాడనేది అర్థం అవుతోందనే విశ్లేషిస్తున్నారు.

అండర్గ్రౌండ్కు వెళ్లాల్సిన పరిస్థితి..

చంద్రబాబు కుటుంబంపై మాట జారిన వంశీ 8 నెలలుగా అండర్ గ్రౌండులో దాక్కోవాల్సివచ్చిందని అంటున్నారు. ఆయనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించినా, ప్రభుత్వ పంతం వల్ల అనూహ్యంగా కిడ్నాప్ కేసులో ఇరుక్కున్నారనే టాక్ వినిపిస్తోంది. గత ఎన్నికల్లో ఓడిన తర్వాత తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని, అమెరికా వెళ్లి వ్యాపారాలు చేసుకుంటానని ప్రభుత్వానికి మధ్యవర్తుల ద్వారా సంప్రదించినా, అటు నుంచి క్షమించే పరిస్థితి లేకపోవడంతో వంశీ ఉక్కిరిబిక్కిరి అయ్యారంటున్నారు. ఏ పార్టీ కోసం అయితే పనిచేశాడో.. అదే పార్టీ కార్యకర్తలుగా బద్ధ శత్రువుగా మారడం వంశీ విషయంలో చూస్తున్నామని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రాజకీయాల్లో పరిధి దాటి వ్యవహరిస్తే ఎలాంటి ఫలితాలు అనుభవించాల్సివస్తుందో వంశీ కేసు ఓ కేస్ స్టడీగా నిలుస్తుందంటున్నారు. కేవలం అదుపు తప్పి నోరు జారిన ఒకే ఒక మాటే వంశీని ఇప్పుడు ఇన్ని కష్టాలు ఎదుర్కొనేలా చేస్తుందనే అభిప్రాయం అంతా వ్యక్తం చేస్తున్నారు.

**జైలుకి వంశీ :** కాగా, వంశీకి విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయనతోపాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న లక్ష్మీపతి, కృష్ణప్రసాద్కు కూడా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. వంశీని హైదరాబాద్లో అరెస్టు చేసిన పోలీసులు గురువారం రాత్ర విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వం తరవున వీరగంధం రాజేంద్ర ప్రసాద్, వంశీ తరవున పొన్నవోలు సుధాకర్రెడ్డి వాదనలు వినిపించారు. రాత్ర 11 నుంచి అర్ధరాత్రి 1.45 వరకు ఇరుపక్షాల వాదనలు కొనసాగాయి. ఈ వాదనలు కొలిక్కి రాకపోవడంతో న్యాయమూర్తి అదనంగా మరో అరగంటపాటు వాదనలు విన్నారు. అనంతరం ముగ్గురికీ 14 రోజులు రిమాండ్ విధించారు.

# ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలి

మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డా.విఎల్ రాజు





తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: ఎస్సి వర్గీకరణను, తెలంగాణ ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డా. వి ఎల్ రాజు డిమాండ్ చేశారు. ఎస్సి వర్గీకరణ చేపట్టిన రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వ అసెంబ్లీ తీర్మాణాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలంగాణ వ్యాప్తంగా పిలువు ఇచ్చిన ఆందోళనల్లో భాగంగా, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు వి ఎల్ రాజు నేతృత్వంలో ట్యాంక్ బండ్ అంబెడ్కర్ విగ్రహం వద్ద మహానాడు కార్యకర్త లు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం లో ఎస్సి వ్యతిరేక పోరాటసమితి, జాతీయ చైర్మన్, సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, సమితి జాతీయ వర్కింగ్ చైర్మన్, పబ్బతి శ్రీకృష్ణ,మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి. సంకు శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జే ఎన్ రావు లు మాట్లాడుతూ, మెజారిటి జనాబా ఉన్న మాలలను ప్రభుత్వం తక్కువ జనాభా గా చూపి, వర్గీకరణ పేరుతో మాలలకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మాలజాతికి వెన్నుపోటు పోడీచారన్నారు. తెలంగాణ అసెంబ్లీ లో మాలల పక్షాన వర్గీకరణకు వ్యతిరేకంగా ఘళం వినిపించాల్సిన మాల మంత్రులు, ఎమ్మెల్యే లు రేవంత్ రెడ్డి అమ్ముడు పోయి మాల జాతిని నమ్మించి గొంతు కోశారని నిప్పులు చేరిగారు. జాతికి మోసం చేసిన మాల ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి, జాతికి బహిరంగ క్షమాపణలు చెప్పాలి వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సి వర్గీకరణ చర్యలతో మాలల తో పాటు, 57 ఎస్సి కులాలకు విద్యా, ఉగ్యోగ, రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లు తుందని ఆందోళన వ్యక్తం చేసారు. కాంగ్రెస్, బిజెపి, ఎం ఆర్ పి ఎస్, ఆర్ ఎస్ ఎస్ లు, రాజకీయ కుట్ర చేసి పూర్తి స్థాయిలో దళితుల భవిషత్తును దెబ్బతీ స్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ ను పెద్ద ఎత్తున అడ్డుకోక పోతే జాతికి బానిసత్వం తప్పదని మాలలను హెచ్చరించారు. కార్యక్రమం లో మాల మహానాడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క దేవేందర్ రావు, బేగరి చంద్ర శేఖర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు. అక్కిదాసరి రవీంద్ర బాబు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షులు సి హెచ్ రోజా లీల, రాష్ట్ర అధ్యక్షులు ఎన్ పద్మ, గ్రేటర్ అధ్యక్షులు భూపల్లి హేమలత, దళిత బహుజన పార్టీ గ్రేటర్ అధ్యక్షులు మద్దె ల ప్రవీన్ కుమార్, నాయకులు సి ఎహ్ సుబ్బారావు, ఎం సత్యనారాయణ, వల్లం సురేష్ పాల్గొన్నారు.

# చరిత్ర పుటల్లో నిలచిపోనున్న

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

## 150 ఏళ్లుగా ప్రయాణీకుల సేవలందించి భవనం

## నేడు విమానాశ్రయ తరహాలో నిర్మాణానికి సన్నాహం




**సికింద్రాబాద్ అనగానే ముందుగా మనకు తట్టే పాత భవనాలు ఇప్పుడు వాటిని చాలా వరకు . కూల్చివేస్తునే ఉన్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ కు తలమానికంగా ఉండే రైల్వే స్టేషన్ ప్రధాన భవనాన్ని అధికారులు నేలమట్టం చేస్తున్నారు. ఇప్పటికే రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా అమృత్ భారత్ స్కీం ప్రకారం ఆధునీకికరణ నూతన భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారు. అన్ని రకాల జాగ్రత్తలు, ముందస్తు చర్యలు తీసుకుంటూ పాత భవనాలను కూల్చి వేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను పలు సినిమాలలో కూడా దర్శకులు చూపించారు. కానీ ప్రస్తుతం ఆ భవనం చరిత్రలో ఉండేదని చెప్పుకోవాల్సిందే మరీ. మరిన్ని వివరాలలోకి వెళితే...**


1952లో కట్టిన సికింద్రాబాద్ స్టేషన్ అప్పటి కళలు, సంస్కృతి ఉట్టిపడేలా నిర్మించిన ఈ కట్టడం గత స్మృతిగా మిగిలిపోనుంది . 1874లో అప్పటి నిజాం నవాబు సికింద్రాబ్ఖాద్ రైల్వే స్టేషన్ను నిర్మించారు. 1916వరకు నిజాం గ్యారెంటెడ్ స్టేట్ రైల్వే(ఎన్జీఎస్ఆర్)కు ఇదే ప్రధాన స్టేషన్గా ఉండేది. 1951లో ఎన్జీఎస్ఆర్ను జాతీయం చేయడంతో ఇండియన్ రైల్వేలో సికింద్రాబాద్ స్టేషన్ భాగమైంది. 1952లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన భవనాన్ని అప్పటి ప్రభుత్వం నిర్మించింది. దీని పోర్టికో నిజాం ఆర్కిటెక్చర్కు అనుగుణంగా కోటను పోలి ఉంటుంది. ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. దీనిని మరో ఏడాదిలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎయిర్పోర్టును తలపించేలా మారనుంది. రూ.720 కోట్లతో చేపట్టిన స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

### అత్యాధునిక వసతుల కల్పన

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను కల్పించేలా అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఉత్తరం, దక్షిణం వైపున జిం3 అంతస్తులతో ఐకానిక్ స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నారు. వాటిలో రిటైల్ దుకాణాలు, ఆహార శాలలు, వినోద సౌకర్యాలు ఉండనున్నాయి. స్టేషన్కు ఇరువైలా రెండు ట్రావెలేటర్లతో పాటు రెండు నడక మార్గాలు, ప్రయాణికులు స్టేషన్లోకి వచ్చేందుకు 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, విశాలమైన రెండు ఫుట్ బ్రిడ్జిలు, ఒక స్కైవేను నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోస్టేషన్ను స్కైవేతో అనుసంధానం చేయనున్నారు. ఉత్తరం వైపు నడకమార్గం, 5వేల కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్ను ఏర్పాటు చేస్తున్నారు.

### పనుల పురోగతి ఇలా..

దక్షిణం వైపు బేస్మెంట్, సివిల్ స్ట్రక్చరల్, ప్లంబింగ్ వంటి పనులు దాదాపు 85శాతం పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్లో ప్రయాణికుల పికప్, డ్రాప్ జోన్ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. రోడ్లు, డ్రైన్లు ఇతర సివిల్ పనులు తుదిదశకు చేరాయి. ఉత్తరం వైపు గణేశ్ ఆలయ సమీపంలో 400 కార్లను నిలిపేలా మల్టీలెవల్ పార్కింగ్ పనులు చేస్తున్నారు. స్టేషన్ భవనంలో యుటిలిటీ షిఫ్టింగ్ 50శాతం పూర్తయింది. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ కార్యాలయ సమీపంలో 1.50 లక్షల లీటర్ల అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంకు, రైలు లైటింగ్ ఏరియా సమీపంలో మరో 2లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయింది.



### శరవేగంగా ఆధునీకరణ పనులు

సికింద్రాబాద్లో ఇప్పటికే ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా నూతన భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా దశలవారీగా రైల్వే స్టేషన్ ఆధునీకరణ ప్రాజెక్టును చేపడుతున్నారు. సుమారు రూ.700కోట్ల అంచనాతో రాబోయే 40 ఏళ్ల వరకు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనతో విమానాశ్రయం తరహాలో రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి చేస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు, సాంకేతికతతో ప్రయాణీకులకు మెరుగైన సేవలు లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

ఇక 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ భవనానికి ధీటుగా.. ఎటువంటి మౌళిక వసతులతో కొత్త భవనాన్ని నిర్మిస్తారో అధికారులు వేచి చూడాల్సిందే. సికింద్రాబాద్ అంటే మనందరికి గుర్తొచ్చేది రైల్వేస్టేషన్ భవన నమూనా. నగర ఆధునీకరణలో భాగంగా సిక్రింద్రాబాద్ రైల్వే స్టేషన్ను కూల్చివేస్తున్నారు అధికారులు. దీంతో నాటి కళా సంస్కృతికి నిలిచిన ఈ కట్టడం గత స్మృతిగా మిగిలింది. అయితే వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను అభివృద్ధి చేయాలని కేంద్రం ఎప్పుడో నిర్ణయించింది. నూతన భవన నిర్మాణం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏ విధంగానూ తీసిపోకుండా నిర్మించడమే కాకుండామరో వంద ఏళ్ల వరకు పెరిగే ప్రయాణికుల తాకిడిని కూడ తట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా

స్టేషన్ ఆధునీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అనేక రైళ్లను ఇతర స్టేషన్లలో నిలుపుదల చేసి ప్రయాణికులకు సమాచారమిస్తూ సేవలందించడమే కాకుండా.. ఇక్కడికే వచ్చే లక్షలాది మంది ప్రయాణికులకు కూడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు

**– విద్య వెంకట్**
**93916 18181.**

## అభివృద్ధి పనులివే



రాజధానికి తలమానికంగా ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ భవనాలు నేలమట్ట మయ్యాయి. ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. 1952లో కట్టిన సికింద్రాబాద్ స్టేషన్ ప్రధాన భవనాలను రైల్వే అధికారులు కూల్చివేశారు. దీంతో అప్పటి కళలు, సంస్కృతి ఉట్టి పడేలా నిర్మించిన ఈ కట్టడం గత స్మృతిగా మిగిలింది

ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారాలు, స్టేషన్కు దారితీసే రోడ్లు వెడల్పు చేయడం ద్వారా రాకపోకలు సులభతరం చేయడం.

ప్రయాణికుల సౌకర్యార్థం సైన్ బోర్డులు, వాహనాల కోసం పార్కింగ్ సదుపాయం, పాదచారుల కోసం ప్రత్యేక మార్గాల అభివృద్ధి, స్టేషన్లో విద్యుదీకరణ.

ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పచ్చదనం, కళలు, సంస్కృతిని ప్రతిబింబించేలా చిత్రాలు, స్టాళ్ల ఏర్పాటు.

సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రాంగణానికి రెండో ప్రవేశాన్ని ఏర్పాటు చేయడం, స్టేషన్ భవన నిర్మాణం.

ఎక్కువ ఎత్తులో ప్లాట్ఫాంల ఏర్పాటు, సరిపడా షెల్టర్ల నిర్మాణం.

మరింత నాణ్యత గల ఎల్ఈడీ స్టేషన్ నేమ్ బోర్డులు, అధునాతన వెయిటింగ్ హాళ్ల అభివృద్ధి, పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టమ్.

నగర కేంద్రాలుగా స్టేషన్లను అభివృద్ధి చేయడం, స్టేషన్ భవనాల అభివృద్ధి, పునరాభివృద్ధి, రద్దీకి ఆస్కారం లేకుండా ట్రాఫిక్ సర్క్యులేషన్, ఇంటర్ మోడల్ ఇంటిగ్రేషన్ వ్యవస్థ ఏర్పాటు



## ప్రశంసలు.. విమర్శలూ ఎక్కువే: స్మృతి మంధాన

మహిళల ప్రీమియర్ లీగ్ మూడో సీజన్కు వేళైంది. డిఫెండింగ్ ఛాంపియన్గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్లో గుజరాత్ జెయింట్స్తో తలపడనుంది. ఐపీఎల్లో ఆర్సీబీ ఇప్పటి వరకూ టైటిల్ సాధించలేదు. కానీ, డబ్ల్యూపీఎల్ టైటిల్ను గతేడాది ఆ మహిళా జట్టు అందించడంతో ఫ్రాంచైజీ ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేవు. ఈ క్రమంలో మహిళా జట్టుపై ప్రశంసలు కురిపించిన అభిమానులు.. పురుషుల టీమ్ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో తమ ఫ్యాన్ బేస్పై ఆర్సీబీ సారథి స్మృతి మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకరకంగా తమ ప్రదర్శనకు వారి అభిమానమే ఎంతో సాయంగా ఉంటుందని తెలిపింది.

"మా చుట్టూ ఏం జరుగుతుందనేది మేం పట్టించుకోం. జట్టుగా నాణ్యమైన క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తాం. ఆర్సీబీకి అభిమాన గణం భారీ స్థాయిలో ఉంటుంది. మిగతా టీమ్లతో పోలిస్తే మాపై వచ్చే ప్రశంసలు, విమర్శలూ కాస్త ఎక్కువగానే ఉంటాయి. ఇలా ఉండటం వల్ల జట్టంతా కలిసికట్టుగా మైదానంలో పోరాడుతాం. ఎక్కడికెళ్లినా అభిమానులు ఆర్సీబీ అంటూ నినాదాలు చేయడం బాగుంటుంది. దానిని మేం పాజిటివ్గానే తీసుకుంటాం" అని మంధాన వ్యాఖ్యానించింది.

**మాకు అది లోటే..**

"డబ్ల్యూపీఎల్ వేలం తర్వాత మా జట్టులో చాలా మంది గాయాలపాలయ్యారు. అందుకే, గత సీజన్లో బరిలోకి దిగిన ఫైనల్ %శ×%లో కొందరు అందుబాటులో లేరు. మా ఆల్రౌండర్ సోఫీ డివైన్ లేకపోవడం మాకు తీవ్రమైన లోటే. గత పదేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్లో అద్భుతంగా రాణించింది. ఆమె తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తాం. ప్లేయర్లకు గాయాలు కావడంపై ఇప్పటికే జట్టులో చర్చించాం. అయినా, మా బ్రాండ్ క్రికెట్ను ఆడేందుకు ప్రయత్నిస్తాం" అని కెప్టెన్ స్మృతి స్పష్టం చేసింది.




## ఉమెన్స్ ప్రీమియర్ లీగ్లో టాప్ ప్లేయర్లు




ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2025 ఫిబ్రవరి 14 నుండి మార్చి 15 వరకు జరుగుతుంది. ఈ మ్యాచ్ లు 4 భారతీయ నగరాల్లో జరుగుతాయి. 5 జట్లు పోటీ పడనున్నాయి. మహిళల ప్రీమియర్ లీగ్ లో గుజరాత్ జెయింట్స్, ఆర్సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్, యూపీ వారియర్స్, ముంబై ఇండియన్స్ జట్లు ఉన్నాయి. డబ్ల్యూపీఎల్ 2025 తొలిమ్యాచ్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , గుజరాత్ జెయింట్స్ తలపడఇంది . రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్పోర్ట్స్18 నెట్వర్క్, జియో సినిమా యాప్ - వెబ్సైట్ లో లైవ్ చూడవచ్చు. అయితే, మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు, అత్యధిక వికెట్లు, అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ల వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**మహిళా ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్లు**

మెగ్ లానింగ్ (ఢిల్లీ క్యాపిటల్స్) - 18 మ్యాచ్లలో 676 పరుగులు
ఎల్లీస్ పెర్రీ (ఆర్సీబీ) - 17 మ్యాచ్లో 600 పరుగులు
షఫాలీ వర్మ (ఢిల్లీ క్యాపిటల్స్) - 18 మ్యాచ్లో 561 పరుగులు
హర్మన్ప్రీత్ కౌర్ (ముంబై ఇండియన్స్) - 17 మ్యాచ్లో 549 పరుగులు
నాట్ స్కైవర్-బ్రంట్ (ముంబై ఇండియన్స్) - 19 మ్యాచ్లలో 504 పరుగులు




**మహిళా ప్రీమియర్ లీగ్ ) చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్లు**

షఫాలీ వర్మ (ఢిల్లీ క్యాపిటల్స్) - 18 మ్యాచ్లో 33 సిక్సులు
సోఫీ డివైన్ (ఆర్సీబీ) - 18 మ్యాచ్లో 20 సిక్సులు
రిచా ఘోష్ (ఆర్సీబీ) - 18 మ్యాచ్లో 17 సిక్సులు
గ్రేస్ హారిస్ (యూపీ వారియర్స్) - 14 మ్యాచ్లలో 16 సిక్సులు
ఆలిస్ కాప్సే (ఢిల్లీ క్యాపిటల్స్) - 17 మ్యాచ్లలో 16 సిక్సులు

**మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన ప్లేయర్లు**

సోఫీ ఎక్లెస్టోన్ (యూపీ వారియర్స్) - 17 మ్యాచ్లలో 27 వికెట్లు
సైకా ఇషాక్ (ముంబై ఇండియన్స్) - 19 మ్యాచ్లో 24 వికెట్లు
హేలీ మాథ్యూస్ (ముంబై ఇండియన్స్) - 19 మ్యాచ్లో 23 వికెట్లు
అమేలియా కెర్ (ముంబై ఇండియన్స్) - 19 మ్యాచ్లో 22 వికెట్లు
మారిజాన్ కాప్ (ఢిల్లీ క్యాపిటల్స్) - 16 మ్యాచ్లో 20 వికెట్లు

## వన్డేల్లో నం.1 బ్యాటర్ దిశగా భారత్ ఆటగాడు




టీమ్ ఇండియా ఓపెనర్ శుభ్మన్ గిల్ వన్డేల్లో నం.1 బ్యాటర్ దిశగా దూసుకెళ్తున్నాడు. ఐసీసీ గురువారం ప్రకటించిన ర్యాంకింగ్స్లో అతను 2వ ర్యాంక్కు చేరుకున్నాడు. ఇంగ్లాండ్తో వన్డే సిరీస్లో గిల్ అదరగొట్టిన విషయం తెలిసిందే. ఓ సెంచరీతోపాటు రెండు అర్ధ శతకాలు బాది సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో గిల్ తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. ఒక్క స్థానం ఎగబాకి 781 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానానికి వెళ్లాడు. పాక్ బ్యాటర్ బాబర్ ఆజామ్ 786 రేటింగ్ పాయింట్లతో టాప్ పొజిషన్లో ఉన్నారు. బాబర్తో పోలిస్తే గిల్ కేవలం 5 పాయింట్ల దూరంలో మాత్రమే ఉన్నాడు. భీకర ఫామ్లో ఉన్న గిల్ చాంపియన్స్ ట్రోఫీలోనూ అదే జోరు కొనసాగిస్తే నం.1 బ్యాటర్గా అవతరించనున్నాడు. ఇతర భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ కూడా తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. ఒక్కడుగు ముందుకేసి టాప్-10లో చోటు సంపాదించాడు. 669 రేటింగ్ పాయింట్లతో 10వ స్థానంలో నిలిచాడు. ఇక, కెప్టెన్ రోహిత్ ఒక్క స్థానాన్ని కోల్పోయి 3వ ర్యాంక్కు, విరాట్ కోహ్లీ రెండు స్థానాలు కోల్పోయి 6వ ర్యాంక్కు పడిపోయారు. కేఎల్ రాహుల్ మూడు స్థానాలు దిగజారి 16వ స్థానానికి పరిమితమయ్యాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్లో భారత బౌలర్లు తమ ర్యాంక్లను మెరుగుపర్చుకోలేదు. స్పిన్నర్ కుల్దీప్ మూడు స్థానాలు, సిరాజ్ నాలుగు స్థానాలు కోల్పోయి 5వ, 10వ స్థానాల్లో నిలిచారు. జడేజా, షమీ 11వ, 13వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇక, ఆల్రౌండర్ ర్యాంకింగ్స్లో అక్షర్ పటేల్ సత్తాచాటాడు. ఏకంగా 15 స్థానాలు ఎగబాకి 40వ ర్యాంక్కు చేరుకున్నాడు.

# ఉప్పల్లో తెలుగు వారియర్స్ రచ్చ

## కుర్చీ మడతపెట్టి అంటూ వైరల్

సెలబ్రిటీ క్రికెట్ లీగ్ టసిసిఎల్ఊ 2025 సీజన్ ఫిబ్రవరి 8వ తేదీ నుండి ప్రారంభమైంది. ఈ 11వ సీజన్ ప్రారంభమైన ఫిబ్రవరి 8 రోజున మొదటి రోజే చిన్నస్వామి స్టేడియంలో జరిగిన రెండవ మ్యాచ్ లో తెలుగు వారియర్స్ - కర్ణాటక బుల్డోజర్స్ జట్లు తలపడ్డాయి. అయితే గత నాలుగు సీజన్లలో ఛాంపియన్గా నిలిచిన తెలుగు వారియర్స్.. ఈ సీజన్ తొలి మ్యాచ్ లోనే కర్ణాటక బుల్డోజర్స్ పై ఓడిపోయింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మొదట ఫీల్డింగ్ ఎంచుకున్నారు. దీంతో మొదట బ్యాటింగ్ ప్రారంభించిన కన్నడ జట్టు ఓపెనర్లు పరుగుల వరద పారించారు. మొదటి ఇన్నింగ్స్ నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది కర్ణాటక బుల్డోజర్స్. బ్యాటర్ కృష్ణ 80 పరుగులతో నాట్ అవుట్ గా నిలిచాడు. ఇక తెలుగు బౌలర్లలో ఆది, ఖయ్యూం చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన తెలుగు వారియర్స్ జట్టుకి ఓపెనర్లు శుభారంభం అందించారు. కానీ ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయారు. ఐదు వికెట్ల నష్టానికి కేవలం 99 పరుగులు మాత్రమే చేశారు. కెప్టెన్ అక్కినేని అఖిల్ ఆఫ్ సెంచరీ తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇక ఆదర్శ్ 25, అశ్విన్ 12 పరుగులు మినహా.. మిగతా బ్యాటర్లంతా ఫెయిల్ అయ్యారు. కర్ణాటక బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో తెలుగు వారియర్స్ ని కట్టడి చేశారు. దీంతో కర్ణాటక జట్టు 14 పరుగులు ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ లోను 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది కర్ణాటక.

ఇక 137 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన తెలుగు వారియర్స్ సెకండ్ ఇన్నింగ్స్ లో 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 91 పరుగులు మాత్రమే చేసింది. దీంతో తెలుగు వారియర్స్ పై 46 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది కన్నడ జట్టు. ఈ నేపథ్యంలో రెండవ మ్యాచ్ లోనైనా గెలుపొంది పరువు నిలబెట్టుకోవాలనే నేపథ్యంలో తెలుగు వారియర్స్ తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తోంది. నేడు ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియంలో సాయంత్రం 6:30 గంటలకు తెలుగు వారియర్స్ - చెన్నై రినోస్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రమే తెలుగు వారియర్స్ జట్టు ఉప్పల్ మైదానానికి చేరుకొని ప్రాక్టీస్ మొదలుపెట్టింది. అయితే తెలుగు వారియర్స్ ప్రాక్టీస్ కి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియోకి మహేష్ బాబు గుంటూరు కారం సినిమాలోని "కుర్చీ మడతపెట్టి" సాంగ్ ని ఆడ్ చేసి వైరల్ చేస్తున్నారు తెలుగు వారియర్స్ అభిమానులు.




# మాస్ జాతర షురూ

### ఇరు జట్లు సంయుక్తంగా 16 సిక్సర్లు, 74 ఫోర్లతో 711 పరుగులు




ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇండియా, పాకిస్తాన్ జట్లు అదరగొడుతున్నాయి. ఒకే రోజు రెండు జట్లకు జరిగిన వన్డే మ్యాచ్ లలో రెండు జట్ల బ్యాటర్లు బ్యాట్ తో దుమ్ములేపారు. మరి ఇంతకీ ఈ జట్లు ఎంత స్కోర్ చేశాయి

ఛాంపియన్స్ ట్రోఫీలో ఫిబ్రవరి 23న భారత్, పాకిస్తాన్ తలపడనున్నాయి. అయితేనేం ఈ మ్యాచ్ కంటే ముందే.. రెండు జట్లు తమ ప్రతాపాన్ని చూపించాయి. ఒకే రోజు జరిగిన వన్డే మ్యాచ్లో భారత్, పాకిస్తాన్ సంయుక్తంగా కలిసి 711 పరుగులు సాధించాయి. వీరిద్దరూ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు, వేర్వేరు జట్లపై ఈ ఫీట్ సాధించాయి. అహ్మదాబాద్లో ఇంగ్లాండ్పై భారత్ చేస్తే.. కరాచీలో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి భారీ స్కోర్ సాధించింది పాకిస్తాన్. దీంతో భారత్, పాకిస్తాన్ ఈ రెండు మ్యాచ్లలో మొత్తంగా 16 సిక్సర్లు, 74 ఫోర్లు బాదేశాయి.

**భారత్-పాకిస్తాన్ '711 పరుగులు'..** అహ్మదాబాద్లో ఇంగ్లాండ్తో జరిగిన వన్డేలో భారత్ 356 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్లో 10 సిక్సర్లు, 36 ఫోర్లు కొట్టింది. ఇక దక్షిణాఫ్రికాపై 353 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన పాకిస్తాన్ 6 సిక్సర్లు, 38 ఫోర్ల సాయంతో మొత్తం 355 పరుగులు చేసింది. ఈ విధంగా, ఒకే రోజు జరిగిన మ్యాచ్లో భారత్ మరియు పాకిస్తాన్ 16 సిక్సర్లు మరియు 74 ఫోర్ల సహాయంతో మొత్తం 711 పరుగులు సాధించాయి.

**కరాచీలో పాకిస్తాన్..** పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్లో మొత్తం 707 పరుగులు నమోదయ్యాయి, ఈ రెండు జట్లు నమోదు చేసిన సరికొత్త రికార్డు. కరాచీలో జరిగిన ఈ మ్యాచ్లో దక్షిణాఫ్రికా ముందుగా బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో 352 పరుగులు చేసింది. ఆ తర్వాత పాకిస్థాన్కు 353 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి పాక్ జట్టు గట్టిగానే స్పందించింది. పాకిస్తాన్ తరపున మహ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘా అద్భుతమైన సెంచరీలు సాధించారు. రిజ్వాన్ 122 పరుగులు చేయగా, సల్మాన్ 134 పరుగులు చేశాడు. ఈ రెండు సెంచరీల సాయంతో పాకిస్తాన్ జట్టు ఘన విజయం సాధించింది.

**అహ్మదాబాద్లో ఇంగ్లాండ్ను ఓడించిన భారత్..**


అహ్మదాబాద్లో ఇంగ్లాండ్తో జరిగిన మ్యాచ్లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 356 పరుగులు చేసింది. శుభ్మాన్ గిల్ అద్భుతమైన సెంచరీతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక భారత్ నిర్దేశించిన 357 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ఛేదించలేకపోయింది. 214 పరుగులకు ఆలౌట్ అయింది.

# ఛాంపియన్స్ ట్రోఫీ భారీ నజరానా!

## విన్నర్ కు రూ. 20.8 కోట్లు, రన్నరప్ కు రూ. 10.4 కోట్లు

పాకిస్థాన్ వేదికగా మరికొద్ది రోజుల్లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఇప్పటికే ఆయా టీమ్లు తమ తుది స్క్వాడ్లను ప్రకటించాయి. అయితే టీమ్ ఇండియా ఆడే మ్యాచులు మాత్రం దుబాయ్ వేదికగానే జరుగుతాయి. ఇక తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్మనీని ఐసీసీ ప్రకటించింది.

2017లో చివరిసారిగా ఈ టోర్నీ జరిగినప్పటితో పోలిస్తే దాదాపు 53 శాతం పెంచారని తెలుస్తోంది. ఈ క్రమంలో సుమారు రూ.60 కోట్ల ప్రైజ్మనీని అన్నీ టీమ్లకు పంచనుంది. అలా చివరి ప్లేస్లో నిలిచిన జట్టుకు కూడా రూ.1.22 కోట్ల మేర దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కో మ్యాచ్కు సుమారు రూ.29 లక్షలు అదనంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది.



**ప్రైజ్ మనీ ఎలా అందించనున్నారంటే :**

విన్నర్ ప్రైజ్ మనీ : రూ. 20.8 కోట్లు
రన్నరప్ ప్రైజ్ మనీ: రూ. 10.4 కోట్లు
సెమీ ఫైనలిస్ట్స్ : రూ. 5.2 కోట్లు (ఒక్కొక్క జట్టుకు)
ఐదు, ఆరు స్థానాల టీమ్స్ : రూ.3 కోట్లు
ఏడు, ఎనిమిది స్థానాల టీమ్స్ : రూ.1.2 కోట్లు
ప్రతి మ్యాచ్కు ప్రైజ్ మనీ: రూ.29 లక్షలు

**గత ట్రోఫీలో ఎవరికెంత వచ్చిందంటే ?**

ఇదిలా ఉండగా, 8 ఏళ్ల క్రితం 2017లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఆ ఫైనల్లో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. అయితే అప్పుడు ఆ జట్టుకు రూ. 14.18 కోట్లను ప్రైజ్మనీని ఇచ్చింది ఐసీసీ. ఇక ఆ మ్యాచ్లో రన్నరప్గా నిలిచిన టీమ్ఇండియాకు రూ.7 కోట్లు వచ్చింది. సెమీస్కు చేరిన బంగ్లాదేశ్, ఇంగ్లాండ్కు చెరొక టీమ్కు రూ.3 కోట్లు రాగా, ఐదు ఆరు స్థానాల్లో నిలిచిన ఆస్ట్రే లియా, సౌతాఫ్రికాకు చెరో రూ.58 లక్షలు, ఆఖరి రెండు ప్లేస్లో వచ్చిన శ్రీలంక, న్యూజిలాండ్కు చెరో రూ.39 లక్షలు అందాయి.

**రెండు గ్రూపులుగా జట్లు :** ఈ సారి ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే 8 జట్లను రెండు గ్రూపులు విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్- 2గా నిలిచిన జట్లు సెమీ ఫైనల్స్కు అర్హత సాధిస్తాయి. గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉన్నాయి. గ్రూప్-బీలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్ ఉన్నాయి.




## క్రికెట్ హిస్టరీలో గ్రేటెస్ట్ ఆల్రౌండర్లు
## జాబితాలో ఇద్దరు భారతీయులు

# 6000 పరుగులు, 600 వికెట్లు

ఏ క్రికెట్ జట్టుకైనా నికార్సైన ఆల్ రౌండర్లే ప్రధాన బలం. టీమ్ అవసరాల మేరకు అటు బంతి, ఇటు బ్యాటుతో రాణించగలరు. టెస్టులు, వన్డేలు, టీ20లు ఏ ఫార్మాట్ అయినా ఆల్రౌండర్లు చాలా కీలకం. కొందరు బ్యాటర్గా మొదలై బౌలింగ్ స్కిల్స్ మెరుగుపరచుకుంటారు. ఇంకొందరు బౌలర్గా వచ్చి బ్యాటింగ్ అందిపుచ్చుకుంటారు. అయితే చరిత్రలో రెండు విభాగాల్లో సమానంగా రాణించిన క్రికెటర్లు అరుదుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో కేవలం ఆరుగురు ఆల్ రౌండర్లు మాత్రమే 6000కు పైగా పరుగులు చేసి 600 వికెట్లకు పైగా తీయగలిగారు. ఈ జాబితాలో భారత ఆటగాళ్లు ఇద్దరు ఉండటం విశేషం.

**షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్) :**షకీబ్ అల్ హసన్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు 14,730 పరుగులు చేశాడు. బంగ్లా తరఫున అత్యధిక పరుగులు చేసిన మూడో ఆటగాడు. అలానే 712 వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్గా నిలిచాడు. షకీబ్ తన కెరీర్లో 14 సెంచరీలు చేయగా, 25 సార్లు ఐదు వికెట్ల పెర్ఫామెన్స్ చేశాడు.

**కపిల్ దేవ్ (భారత్) :** నేటికీ భారత టాప్ ఆల్రౌండర్ల ప్రస్తావన వస్తే కపిల్ దేవ్ పేరు కచ్చితంగా వినిపిస్తుంది. 1983లో టీమ్ఇండియాకి వరల్డ్ కప్ అందించిన కెప్టెన్. కపిల్ తన కెరీర్లో 9,031 పరుగులు చేశాడు. ఇందులో 9 సెంచరీలు ఉన్నాయి బౌలర్గా 687 వికెట్లు తీశాడు. 25 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

**షాన్ పొలాక్ (దక్షిణాఫ్రికా) :**షాన్ పొలాక్ దక్షిణాఫ్రికా అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడు. దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. పొలాక్ మొత్తంగా 829 వికెట్లు తీశాడు. ఇందులో 21 ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. పొలాక్ బౌలింగ్తో పాటు నమ్మకమైన లోయర్-ఆర్డర్ బ్యాట్స్మన్. అతడి కెరీర్లో 7,386 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు ఉన్నాయి.

**డేనియల్ వెట్టోరి (న్యూజిలాండ్) :** డేనియల్ వెట్టోరి న్యూజిలాండ్ గొప్ప స్పిన్నర్లలో ఒకడు. కెరీర్లో 705 వికెట్లు తీశాడు. 22 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. న్యూజిలాండ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్. స్పెషలిస్ట్ బౌలర్గా అయినా సరే కెరీర్లో 6,989 పరుగులు చేశాడు. అందులో 6 సెంచరీలు ఉన్నాయి.

**రవీంద్ర జడేజా (భారత్) :** జడేజా టీమ్ఇండియా టాప్ ఆల్రౌండర్లలో ఒకడు. అతడు 17 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఏకంగా 603 వికెట్లు పడగొట్టాడు. 4 సెంచరీలతో సహా 6,664 పరుగులు చేశాడు. ప్రస్తుత తరంలో అత్యుత్తమ ఆల్ రౌండర్గా కొనసాగుతున్నాడు.

**వసీం అక్రమ్ (పాకిస్థాన్)**

పాకిస్థాన్ తరఫుర వసీం అక్రమ్ బంతి, బ్యాటుతో రాణించాడు. కెరీర్లో 916 వికెట్లు పడగొట్టాడు. 31 సార్లు ఐదు వికెట్లు తీశాడు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక వికెట్లు తీసిన పాకిస్థాన్ బౌలర్గా నిలిచాడు. 3 సెంచరీలతో 6,615 పరుగులు చేశాడు.

సూర్య
హైదరాబాద్
శనివారం
15 ఫిబ్రవరి 2025
10
suryachitramagazine@gmail.com
సూర్య సినిమా

# బుక్ మై షోలో తల మూవీ టికెట్ ను కొన్న నాగార్జున

దీపా ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీనివాస్ గౌడ్ నిర్మాతగా అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా 'తల'. ఈ చిత్రంతో అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ ఈ హీరోగా పరిచయం అవుతున్నాడు. అంకిత నస్కర్ హీరోయిన్. రోహిత్, ఎస్తేర్ నోరన్హ,ముక్కు అవినాష్, సత్యం రాజేష్, అజయ్, విజ్జి చంద్ర



శేఖర్, రాజీవ్ కనకాల, ఇంద్రజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శ్యామ్ కే నాయుడు సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి ధర్మతేజ సంగీత దర్శకుడు. తల సినిమా ఈ 14న విడుదల కాబోతోంది. ఇప్పటికే తలపై భారీ అంచనాలున్నాయి. ప్రమోషనల్ కంటెంట్ చూసిన వాళ్లంతా ప్రామిసింగ్ గా ఉందని మెచ్చుకుంటున్నారు. ఇక తాజాగా కింగ్ నాగార్జున బుక్ మై షోలో ఈ మూవీ ఫస్ట్ టికెట్ ను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ చిత్ర ట్రైలర్ ను చూసి చాలా మెచ్చుకున్నారు. రాగిన్ రాజ్ పెద్ద హీరో అవుతాడని ఆశీర్వదించారు. అమ్మ రాజశేఖర్ డైరెక్షన్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉందని కితాబునిచ్చారు. అమ్మ రాజశేఖర్ తో తన మొదటి పరిచయాన్ని గుర్తు చేసుకుని ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలని ఆకాక్షిస్తూ.. నిర్మాత శ్రీనివాస్ గౌడ్‌కు ఆల్ ద బెస్ట్ చెప్పారు. బుక్ మై షోలో నాగార్జున తల మూవీ ఫస్ట్ టికెట్ ను కొనడం ఈ సినిమా సాధించబోతోన్న పెద్ద విజయానికి చిహ్నం అని దర్శకుడు అమ్మ రాజశేఖర్ ఈ సందర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# బాపు అరుదైన సినిమా ఎక్సయిటెడ్ గా ఎదురు చూస్తున్నాను- రానా దగ్గుబాటి



వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్ లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీ-డ్రామా 'బాపు'. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫెబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో రానా దగ్గు బాటి, తిరువీర్ ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ..రెగ్యులర్ కి భిన్నంగా వుండే ఇలాంటి జోనర్స్ రావడం చాలా అరుదు. ఒక కల్చర్ ని చూపించే జానర్స్ రావడం ఆడియన్‌గా చాలా ఎక్సయిటెడ్‌గా వున్నాను. టీం అందరికీ అల్ ది వెరీ బెస్ట్' అన్నారు. హీరో తిరువీర్ మాట్లాడుతూ.. బాపు టైటిల్ పెట్టగానే నచ్చేసింది. ఇందులో ప్రమోషనల్ కంటెంట్ నా బాల్యానికి తీసుకెళ్ళింది. ట్రైలర్ లో మట్టివాసన కనిపించింది. బ్రహ్మాజీ గారిని ఇలాంటి పాత్రల్లో చూస్తే కడుపునిండిపోయింది. దయ చాలా మంచి సినిమా తీశారు. అందరూ ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అన్నారు.

# 'జగన్నాథ్' టీజర్ లాంచ్

భరత్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై భరత్, సంతోష్ దర్శకత్వంలో, పీలం పురుషోత్తం నిర్మాణంలో తెరకెక్కుతున్న మూవీ 'జగన్నాథ్'. రాయలసీమ భరత్, ప్రీతి జంటగా నటిస్తున్న ఈ మూవీ టీజర్‌ను, పోస్టర్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్న రాక్‌స్టార్ మంచు మనోజ్ రిలీజ్ చేశారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో ఘనంగా జరిగిన 'జగన్నాథ్' మూవీ టీజర్ లాంచ్ వేడుకలో జబర్దస్త్ కామెడియన్స్ అప్పరావు, వినోదిని,




గడ్డం నవీన్ పాల్గొని వినోదం పంచారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ.. 'జగన్నాథ్' మూవీ టీజర్ చాలా అద్భుతంగా ఉంది. తమ్ముడు 'రాయలసీమ' భరత్ చేసిన ఫస్ట్ మూవీ అయినప్పటికీ ఎంతో ప్రొఫెషనల్‌గా చేశాడు. చిత్రయూనిట్‌లో ప్రతి ఒక్కరి కష్టం కనిపిస్తోంది. భరత్ ఫ్రెండ్స్ అంతా ముందుకు వచ్చి ఈ సినిమా నిర్మాణంలో పాలుపంచుకోవడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ రోజుల్లో సినిమా తీయడం అంత ఈజీ కాదు. అలాంటి పరిస్థితుల్లో ఎంతో ఫ్యాషన్‌తో ఈ సినిమా తీశారు. కోటి రూపాయలతో తీసిన సినిమా చిన్నది, వెయ్యి కోట్లతో తీసింది పెద్ద సినిమా అనడానికి లేదు. ఏదైనా సినిమానే. కాకపోతే, బాగుందా? బాగాలేదా? అనేదే ఉంటుంది. ఈ సినిమా 'జగన్నాథ్' మూవీ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆల్ ది బెస్ట్ మూవీ టీం." అని అన్నారు.

# "డార్క్ నైట్" టీజర్ రిలీజ్

పూర్ణ ప్రధాన పాత్రలో పి.19 ట్రాన్సమీడియా స్టూడియోస్ పతాకంపై పటోళ్ళ వెంకట్ రెడ్డి సమర్పణలో సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ కథా చిత్రం "డార్క్ నైట్". ఈ చిత్రాన్ని జి.ఆర్.ఆదిత్య దర్శకత్వం వహించారు. పూర్ణ ఆమె సరసన కథ, వీకెండ్ లవ్,పి వి ఎస్ గరుడవేగా,24 కిస్సెస్, కథ కంచికి మనం ఇంటికి, ప్రేమదేశం, మనమే వంటి చిత్రాలలో నటించిన త్రిగుణ్ (ఆదిత్ అరుణ్), నటించగా విధార్థ్, సుభాశ్రీ రాయగురు, మిగతా ముఖ్య పాత్రలలో నటిస్తున్నారు. ప్రస్తుతం సెన్సార్ కి సిధమైంది. కాగా ఈ రోజు ఉదయం దర్శకుడు వి వి వినాయక్ చేతుల మీదుగా చిత్రానికి చెందిన రిలీజ్ ను సోనీ మ్యూజిక్ ద్వార విడుదల చేయడం జరిగింది.

ఈ సందర్భంగా డైనమిక్ డైరెక్టర్ వి వి వినాయక్ మాట్లాడుతూ : " సురేష్ రెడ్డిగారు మా ప్రాంతం నుండి వచ్చి నిర్మాతగా తెలుగు సినీ పరిశ్రమకు డార్క్ నైట్ చిత్రంతో పరిచయం అయ్యారు చాలా సంతోషం. ప్రస్తుతం థ్రిల్లర్ కథ చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు ముఖ్యంగా యూత్, పి.19 ట్రాన్సమీడియా స్టూడియోస్ బ్యానర్ లో తొలి చిత్రంగా పూర్ణ, త్రిగుణ్ మెయిన్ లీడ్ గా వస్తున్నడార్క్ నైట్ తప్పక విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ చిత్రం విజయం తో ఆయన మరిన్ని చిత్రాలు తీసి తెలుగు సినీ పరిశ్రమ లో ప్రముఖ వ్యక్తిగా నిలబడాలని ఆశిస్తున్నాను" అన్నారు.



# ఇది తండ్రి కొడుకుల ప్రేమికుల రోజు - నాని

స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై ప్రభాకర్ అరిపాక సమర్పణలో పృధ్వీ పోలవరపు నిర్మాతగా సముద్రఖని ప్రధానపాత్రలో నటించిన ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. హీరో నాని మాట్లాడుతూ%-% " రామం రాఘవం" ట్రైలర్‌ను నా చేతులమీదుగా విడుదల చేయటం ఆనందంగా



ఉంది. ముఖ్యంగా ధన్‌రాజ్ నాకు కెరీర్ మొదట్నుండి పరిచయం. అప్పుడే అతని టాలెంట్ రేంజ్ ఏంటో నాకు తెలుసు. అందుకే 'రామం రాఘవం' సినిమాని ధన్‌రాజ్ దర్శకత్వం వహించాడంటే నాకు పెద్దగా ఆశ్చర్యం అనిపించలేదు. ధన్‌రాజ్ కామెడి సినిమా తీస్తాడేమో అనుకున్న నన్ను ట్రైలర్ చూపించి ఎమోషనల్ డ్రైవ్‌లోకి తీసుకెళ్లాడు. సముద్రఖని అన్న వర్క్ అంటే వ్యక్తిగతంగా నాకు ఎంతో ఇష్టం. ఆయన నేను ఫ్యామిలీలా ఉంటాము. నిర్మాత పృథ్వీ పోలవరపు మంచి కంటెంట్ ఉన్న సినిమాని నిర్మించటం మంచి విషయం. 'శశి' సినిమాలో " ఒకే ఒక లోకం నువ్వు....." పాట నాకు ఎంతో ఇష్టం. ఆ సినిమాకి సంగీతాన్నిచ్చిన అరుణ్ చిలివేరు 'రామం రాఘవం' సినిమాకు చక్కని సంగీతాన్ని ఇచ్చారని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతుంది. టీమందరికి ఆల్ ది బెస్ట్ చెప్తూ 21వ తారీకు కోసం ఎదురు చూస్తున్నా " అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ' నా సొంత తమ్ముడులాంటి నాని 'రామం రాఘవం' ట్రైలర్‌లాంచ్ చేయటం సంతోషంగా ఉంది. ధన్‌రాజు దర్శకత్వంలో ఫిబ్రవరి 21న వస్తున్న మా సినిమాని థియేటర్‌లో చూసి నన్ను మా టీమ్‌ని ఆశీర్వదించండి" అన్నారు.

# నా లవ్ స్టోరీ ఫస్ట్ లుక్ పోస్టర్



మహీర క్రియేషన్స్, సుప్రియ ఆర్ట్స్ బ్యానర్ల పై దొమ్మరాజు అమరావతి, శ్రీకాంత్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న నా లవ్ స్టోరీ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను. "ఆర్ఎక్స్ 100 చిత్ర దర్శకుడు అజయ్ భూపతి లాంచ్ చేశారు. ఈ నా లవ్ స్టోరీ చిత్రానికి వినయ్ గోను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా అజయ్ భూపతి మాట్లాడుతూ... ఈ చిత్ర దర్శకుడు "వినయ్ గోను, నేను ఆర్జీవీ దగ్గర అసిస్టెంట్స్‌గా వర్క్ చేశాం. ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా పోస్టర్ ను లాంచ్ చేయడం నాకు చాలా హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ చాలా యూనిక్ గా ఉంది. స్టూడెంట్స్ హాస్టల్ బ్యాక్ డ్రాప్ లో జరిగే ఒక కొత్త తరహా ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దర్శకుడు వినయ్ గోను ఈ సినిమా ద్వారా పెద్ద సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను" అని దర్శక నిర్మాతలకు, చిత్ర యూనిట్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ చిత్ర దర్శకుడు వినయ్ గోను మాట్లా డుతూ.."మా పోస్టర్ లాంచ్ చేసిన నా దర్శక మిత్రులు అజయ్ భూపతి గారికి ధన్యవాదాలు" అని చెప్పారు.

# అల్టిమేట్ లవ్ స్టోరీ "అరి వీర భయంకర"



యూనివర్సల్ క్రియేటివ్ స్టూడియోస్, శ్రీకర్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై శేషు బాబు. సీహెచ్, కాసుల రామకృష్ణ నిర్మిస్తున్న సినిమా "అరి వీర భయంకర". ఈ చిత్రానికి కిషన్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. అక్సాఖాన్, వైదిక, ఐశ్వర్య, కనిక మోంగ్యా, అర్చనా రాయ్, డెబొర, అమిత శ్రీ , శృతి రాజ్, సోమదత్త, నాగ మహేశ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో "అరి వీర భయంకర" సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో నిర్మాత శేషు బాబు. సీహెచ్. మాట్లాడుతూ – పూజా కార్యక్రమాలతో మా అరి వీర భయంకర సినిమా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. మా యూనివర్సల్ క్రియేట్ స్టూడియోస్, రామకృష్ణ గారి శ్రీకర్ మూవీ మేకర్స్ తో కలిసి సినిమాను నిర్మిస్తున్నాం. దర్శకత్వ శాఖలో అపార అనుభవం ఉన్న కిషన్ గారి దర్శకత్వంలో మూవీ నిర్మించడం సంతోషంగా ఉంది. రెండేళ్లుగా ఈ ప్రాజెక్ట్ మీద వర్క్ చేస్తున్నాం. మీ అందరి సపోర్ట్ తో త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అన్నారు.

# సుమంత్ ప్రభాస్, జగపతి బాబు, సెకండ్ షెడ్యూల్ పూర్తి



తన తొలి మూవీ 'మేం ఫేమస్'తో లీడ్ యాక్టర్, దర్శకుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా తన రెండో మూవీతో రాబోతున్నారు. ఈ కొత్త మూవీ రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ మేడిన్ వెంచర్. %వీ=% ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ షెడ్యూల్‌లో హై-ఎనర్జీ సన్నివేశాలు చిత్రీకరించారు. వీటిలో ఫస్ట్ అఫ్ ఇట్స్ కింద్ ఆటో రేస్ సీక్వెన్స్, ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి, ఇవి థ్రిల్లింగ్ సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తాయి. అలాగే సుమంత్ ప్రభాస్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, సుదర్శన్, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మలతో కూడిన కామెడీ ట్రాక్‌లను చిత్రీకరించారు. రేలంగి, భీమవరం, సకినేటిపల్లి లంక, అంతర్వేది ఆలయ ప్రాంగణంతో సహా అందమైన లోకేషన్స్ లోషూటింగ్ జరిగింది. ఈ షెడ్యూల్‌లో అనేక కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించారు. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, లైలా, రాజీవ్ కనకాల, హర్షవర్ధన్ షూటింగ్ లో పాల్గొన్నారు. ఇప్పుడు టీం మూడవ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది, ఫిబ్రవరి చివరి వారంలో ప్రారంభమై మార్చి మిడ్ టైం వరకు కొనసాగనుంది. ఇందులో పాటలు, ఇతర కీలకమైన సన్నివేశాల చిత్రీకరించనున్నారు.

# 'కోబలి' పార్ట్-2 మరింతగా

'నింబస్ ఫిలిమ్స్' 'యు1 ప్రొడక్షన్స్' 'టి.ఎస్.ఆర్ మూవీ మేకర్స్' సంస్థలపై జ్యోతి మెగావత్ రాథోడ్, రాజశేఖర్ రెడ్డి కామిరెడ్డి, తిరుపతి శ్రీనివాసరావు సంయుక్తంగా నిర్మించిన రా అండ్ రస్టిక్ వెబ్ సిరీస్ 'కోబలి'. ఫ్యాక్షన్ బ్యాక్ డ్రాప్లో రూపొందిన ఈ సిరీస్లో రవి ప్రకాష్, రాకీ సింగ్ ప్రధాన పాత్రలు పోషించగా.. తరుణ్ రోహిత్, శ్రీతేజ్, శ్యామల, యోగి ఖత్రి, శ్రీ పవన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. రేవంత్ లేవాక దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 4 నుండి డిస్నీ ప్లస్ హాట్ స్టార్లో 7 భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్ కి అన్ని రాష్ట్రాల ప్రేక్షకుల నుండి సూపర్ రెస్పాన్స్ లభించింది. నార్త్ నుండి కూడా దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటికీ నెంబర్ వన్ ప్లేస్లో ట్రెండ్ అవుతోంది 'కోబలి'. దీంతో మేకర్స్ హైదరాబాద్లోనిలో సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసి మీడియా వారికి, ప్రేక్షకులకి ధన్యవాదాలు తెలుపుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా.. రవి ప్రకాష్ మాట్లాడుతూ.. "అందరికీ థాంక్స్ చెప్పి బోర్ కొట్టించదలుచుకోలేదు. కానీ మీడియాకి,హాట్ స్టార్‌కి, ప్రేక్షకులకి మాత్రం థాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నాను. నేను ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్ళు అయ్యింది. కొత్తగా ఏదో ఒకటి చేయాలి అనే నమ్మకంతో 'కోబలి' మొదలుపెట్టాను. ఒక కాఫీ షాప్లో ఈ కథ విన్నాను. నాకు నచ్చింది. కానీ ఇది ముందుకు వెళ్తుంది అనే నమ్మకం అప్పుడు నాకు కలగలేదు.

# ప్రభాస్, హను రాఘవపూడి ప్రాజెక్ట్‌లో అనుపమ్ ఖేర్



మ్యాసీవ్ బ్లాక్‌బస్టర్స్ సలార్, కల్కి 2898 ఎడి తర్వాత రెబెల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడితో ఓ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ కోసం కొలాబరేట్ అయ్యారు. ప్రముఖ పాన్-ఇండియా స్టూడియో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం లార్జర్ దెన్ లైఫ్ ఎలిమెంట్స్ తో విజువల్ వండర్‌గా ఉండబో తోంది. లేటెస్ట్ అప్‌డేట్ ఏమిటంటే, ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండ్ అనుపమ్‌ఖేర్ చాలా ముఖ్యమైన పాత్ర కోసం ఎంపికయ్యారు. ఈ వార్తను ఆయన స్వయంగా షేర్ చేశారు. గొప్ప పాత్రలు చేయడంలో పేరుపొందిన అనుపమ్, ఈ సినిమా స్క్రిప్ట్‌ను "అద్భుతం" అని అన్నారు. ప్రభాస్‌తో స్క్రీన్ స్పేస్‌ను పంచుకోవడానికి ఉత్సాహంగా వున్నారు. దర్శకుడు హను రాఘవపూడి ప్రతిభను కూడా ఆయన ప్రశంసించారు.

# కిచ్చా సుదీప్ 'మ్యాక్స్'



మాస్ ఎంటర్‌టైనర్ ఆఫ్ ది ఇయర్ అయిన 'మ్యాక్స్' డిజిటల్ ప్రీమియర్‌ను జీ5 ప్రకటించింది, కన్నడ బాద్ షా రీసెంట్ బ్లాక్ బస్టర్ 'మ్యాక్స్' మూవీ ఫిబ్రవరి 15న రాత్రి 7:30 గంటలకు జీ5లో స్ట్రీమింగ్ కానుంది. నూతన దర్శకుడు విజయ్ కార్తికేయ డైరెక్షన్‌లో వచ్చిన ఈ హై ఆక్టేన్, హార్ట్ రేసింగ్ రోలర్‌కోస్టర్ మూవీకి థియేటర్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ అవతార్‌లో కిచ్చా సుదీప్ చాలా కొత్తగా కనిపించారు. కన్నడ బాక్సాఫీస్ వద్ద మ్యాక్స్ రికార్డులు సృష్టించింది. కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళంలోనూ మంచి ఆదరణను దక్కించుకుంది. కిచ్చా సుదీప్‌తో పాటుగా ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, సంయుక్త హెూర్నాడ్, సుకృతా వాగ్లే, సునీల్, అనిరుధ్ భట్ వంటి వారి నటించి మెప్పించారు. కలైపులి ఎస్. థాను (వి క్రియేషన్స్), కిచ్చా సుదీప (కిచ్చా క్రియేషన్స్) నిర్మించిన ఈ థ్రిల్లింగ్ చిత్రం ఇప్పటికే 2024లో అత్యధిక వసూళ్లు సాధించిన కన్నడ చిత్రంగా నిలిచింది. ఇక ఈ మ్యాక్స్ జీ5లోకి వచ్చే సమయం ఆసన్నమైంది. పోలీసు ఇన్‌స్పెక్టర్ అర్జున్ మహాక్షయ్ (కిచ్చా సుదీప్)గా మ్యాక్స్‌లో కిచ్చా సుదీప్ అదరగొట్టేశారు. పోలీస్ ఆఫీసర్ పవర్, గ్యాంగ్ స్టర్‌లను పరుగులు పెట్టించే నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ పాత్రలో కిచ్చా సుదీప్ మెప్పించారు. ఒక్క రాత్రిలో జరిగే ఘటనలను ఎంతో గ్రిప్పింగ్‌గా చూపించి ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నారు. జీ5లోకి మ్యాక్స్ డిజిటల్ స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా.. జీ5 ప్రతినిధి మాట్లాడుతూ.. 'అల్టిమేట్ మాస్ బ్లాక్ బస్టర్ అయిన మ్యాక్స్ చిత్రాన్ని జీ5 ప్రేక్షకులకు అందించడం పట్ల మేం సంతోషంగా ఉన్నాం. కిచ్చా సుదీప్, సినిమా టీం ఇచ్చిన ఈ సహకారం మాకు ఒక అద్భుతమైన మైలురాయిని అందించేలా చేసింది.

# హారర్ థ్రిల్లర్ 'శంబాల' ఫస్ట్ లుక్

విమర్శకుల ప్రశంసలు పొందిన కృష్ణమ్మ చిత్రంలో తన పాత్రతో అందరినీ ఆకట్టుకున్నారు అర్చన అయ్యర్. ప్రస్తుతం అర్చన అయ్యర్ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్'లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం మేకర్లు ఈ చిత్రంలోని ఒక్కో క్యారెక్టర్‌ను రివీల్ చేస్తూ వస్తున్నారు. ఆది సాయికుమార్, స్వాసిక పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా అర్చన అయ్యర్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దేవీ పాత్రలో అర్చన అయ్యర్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అర్చన ఎరుపు చీరలో కనిపిస్తోంది. ఇంటెన్స్ ఎమోషన్స్‌ను పలికిస్తూ కనిపించింది. బ్యాక్ గ్రౌండ్‌లో పంట, గుడి, పక్షులు, దిష్టిబొమ్మ ఇలా అన్నీ కూడా చాలా క్యూరియాసిటీని పెంచేలా ఉన్నాయి. పోస్టర్లతోనే అందరిలోనూ ఆసక్తిని పెంచేస్తోంది చిత్రయూనిట్. యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రామిసింగ్ హీరో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్ పాత్రను పోషిస్తున్నారు.





PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.